J/Nellore/003/2018-20 R.N.I.No.25359/74
నెల్లూరు, 21.08.2020, శుక్రవారం సంపుటి : 40 సంచిక : 12 పేజీలు : 12, వెల : ₹ 5

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి www.lawyerteluguweekly.com






# బాలూ కోలుకోవాలి

- అభిమానుల పూజలు, ప్రార్థనలు
- నిలకడగా ఆయన ఆరోగ్యం

భారతీయ సినిమా గాయకులు, నెల్లూరీయుల గానాల పట్టి, శ్రీపతి పండితారాధ్యుల బాలసుబ్రహ్మణ్యం కరోనా తాకిడితో బాధపడుతూ ఈ నెల 5 వ తేదినుండి మద్రాసులోని యంజియం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసిందే. ఒక దశలో ఆయన ఆరోగ్యం క్షిణించి వెంటిలేటర్ అమర్చాల్సిన పరిస్థితి రావడంతో ఆయన త్వరగా కోలుకుని పరిపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని (మిగతా 11వ పేజీలో)

## ఆంధ్రాలో ఎంపీలు

# డమ్మీలయ్యారా?

- పేరుకు పదవున్నా.. పవర్లో మాత్రం సున్నా..!
- ఏ ప్రాధాన్యతా లేని పార్లమెంటు సభ్యులు

ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని పార్లమెంటు సభ్యులు షోకేసులోని బొమ్మలేనా...? వీరికి పదవులే తప్ప పవర్స్ లేవా...?? ఇది ఇప్పుడు సామాన్యుడికి సైతం వస్తున్న అనుమానం. అయితే పై ప్రశ్నలకు అవుననే సమాధానాలిస్తున్నాయి రాజకీయ మేధావి వర్గాలు. ఏ కొద్దిమందో తప్ప మిగిలిన ఆంధ్రా యంపీలందరూ ముమ్మాటికీ డమ్మీలేనన్నది వారి విశ్లేషణ. ఆంధ్రాలో వారి వాణి వినిపించడంలేదు, వారి జాడ కనిపించడం లేదు, రాష్ట్రంలోని పార్లమెంటు నియోజకవర్గాలలో తమకు ఒక యంపి ఉన్నాడని అక్కడ ప్రజలెవరికీ అసలు అనిపించడంలేదు.

కొన్ని నియోజకవర్గాల పార్లమెంటు సభ్యుల పేర్లుకూడా చాలామంది ఆంధ్రప్రజలకు తెలియదని, కొన్ని నియోజకవర్గాలలో అయితే తమ లోక్‌సభ సభ్యుడు ఎవరో కూడా అక్కడివారు చెప్పలేకున్నారన్నది కూడా వారి వాదన. వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టినప్పడినుండి ఎప్పుడూ లేనివిధంగా శాసనసభ్యులదే రాజ్యం అయిపోయిందన్నది వారి అభిప్రాయం.

(మిగతా 11వ పేజీలో)






## త్వరలో తెలంగాణలో

# సరిహద్దులు మూత..?

- కరోనా పేషెంట్లకు నో ఎంట్రీ..!

ఆంధ్రా నుండి తెలంగాణాకు వెళ్లాలంటే ఇప్పటివరకు ఎలాంటి షరతులు నిబంధనలు లేవు, అదే తెలంగాణా నుండి ఆంధ్రాకు రావాలంటే ఈ-పాస్ తీసుకోవాలి. అయితే త్వరలో తెలంగాణా గేట్లు మూసేసే ఆలోచనలో అక్కడి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు ఆలోచిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఆంధ్రాతో పాటు తెలంగాణాలోకి వచ్చే అన్ని సరిహద్దులనూ మూసేసి కరోనా పేషెంట్లకు ప్రవేశం లేకుండా చేయాలన్నది తెలంగాణా ప్రభుత్వ ఆలోచనగా తెలుస్తోంది. టెస్టులు చేస్తున్నారా..? లేదా..?? అన్న అంశం పక్కన పెడితే ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణాలో కరోనా కేసుల సంఖ్య తక్కువగా వుంది. ఇతర రాష్ట్రాలలో ఈ సంఖ్య గణనీయంగా పెరగడంతో ఆయా రాష్ట్రాలనుండి వైద్యం కోసం రోగులు హైదరాబాదుకు పరుగులు పెడుతుండడంతో తెలంగాణలో ఇతర రాష్ట్రాల కేసులు నమోదవుతున్నాయని అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారట. విషయం విన్న ముఖ్యమంత్రి సరిహద్దులు మూసేసి కరోనా రోగులకు ప్రవేశం లేకుండా చేస్తే ఎలా ఉంటుందో ఆలోచించమని అధికారులకు సూచించాడని అధికారవర్గాల సమాచారం.

మొన్న మొన్నటి వరకు ఆంధ్రాలోకి వచ్చే వారికీ టెస్టులుచేసి నెగటివ్ ఉంటేనే రాష్ట్రంలోకి అనుమతించారు. ఇటీవలే ఆ నిబంధనలని (మిగతా 11వ పేజీలో)



# జిల్లాలో కరోనా కల్లోలం



- 19,300కు చేరిన బాధితులు
- 245కు చేరుకున్న మృతుల సంఖ్య
- ఇద్దరు ఎమ్మెల్సీలకు కోవిడ్ పాజిటివ్

జిల్లాలో కరోనా వీరవిహారం చేస్తూనే ఉంది. ఎమ్మెల్సీలు, రాజకీయ నాయకులను కూడా ఇది వదిలిపెట్టడం లేదు. ఇప్పటికే జిల్లాలో ఇద్దరు ఎమ్మెల్సీలు కరోనా బారినపడినట్లు సమాచారం. జిల్లా టిడిపి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, బిజెపి నాయకుడు వాకాటి నారాయణరెడ్డిలకు కోవిడ్ పాజిటివ్ వచ్చినట్లు తెలుస్తోంది.

జిల్లా అధికారయంత్రాంగమంతా ఈ కోవిడ్ వైరస్‌పై దృష్టిపెట్టి అహరహం ఆ వ్యాధి నివారణకు చర్యలు తీసుకుంటూనే ఉన్నా ఆ వ్యాధి రోజురోజుకూ విజృంభిస్తూ తన ప్రతాపం చూపుతూనే ఉంది. ఈనెల19వతేదీ నాటికి జిల్లాలో కరోనా పాజిటివ్ కేసుల సంఖ్య 19,300కు చేరుకుందంటే ఈ వ్యాధి ఎంతగా విలయ తాండవం చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పటిదాకా ఈ వ్యాధికి 245 మంది బలయ్యారు. 452 మంది బాధితులు ఈ వ్యాధి నుంచి కోలుకుని డిశ్చార్జి అయ్యారు. ఈనెల 19న ఒక్కరోజే 755 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. తాజాగా కోవిడ్ సోకిన వారిలో 350 మందిని నారాయణ ఆసుపత్రికి, పెద్దాసుపత్రి, నెల్లూరు ఆసుపత్రి, కోవిడ్ కేర్ సెంటరు, మెడికవర్ సెంటర్ ఆసుపత్రులకు తరలించి చికిత్సలందిస్తున్నారు. మిగిలినవారిని ఐసొలేషన్‌లో ఉంచి డాక్టర్లు ఎప్పటికప్పుడు వారి ఆరోగ్య పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ఈ ఒక్కరోజే 15 మంది కరోనాతో మృత్యువాత పడ్డారు. దీంతో ఆయా కుటుంబాలు శోకసాగరంలో మునిగిపోయాయి.

**ముందుజాగ్రత్తలతోనే కోవిడ్ కట్టడి :**

కరోనా వైరస్‌ను కట్టడి చేసేందుకు ప్రజలు తప్పనిసరిగా ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, మాస్కులు ధరించడం, చేతులు తరచూ సబ్బుతో శుభ్రం చేసుకుంటూ ఉండడం, స్వీయనియం త్రణలో ఉంటూ ఇళ్ల నుంచి బయటకు రాకుండా ఉండడం, అత్యవసర పనులపై ఒకవేళ వచ్చినా భౌతికదూరం పాటించడం, వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండడం వంటి సూచనలను పాటించాలని, ప్రభుత్వాలు చెప్తున్న నియమనిబంధనలు తప్పకుండా పాటించి కరోనా నియంత్రణకు సహకరించాలని అధికారులు పదేపదే విజ్ఞప్తి చేస్తూనే ఉన్నారు.

**కలెక్టర్‌కు కృతజ్ఞతలు :**

కరోనా బారినపడ్డ జర్నలిస్టుల కోసం నారాయణ ఆసుపత్రిలో 30 పడకలతో ప్రత్యేక వార్డు కేటాయించినందుకు ఏపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్, జర్నలిస్టు సంఘాల నాయకులు కలెక్టర్ చక్రధర్‌బాబుకు, జేసీ ప్రభాకర్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# పరసాకి సతీ వియోగం

- ఆయన పరిస్థితి ఆందోళన కరం



మాజీ మంత్రి తిరుమల తిరుపతి దేవస్థానాల మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు తెలుగుదేశం నాయకుడు, పరసా వెంకట రత్నం కుటుంబం కరోనా బారిన పడింది. ఆయనతో పాటు ఆయన సతీమణికి ఇతర కుటుంబసభ్యులు 5 మందికి ఈ వ్యాధి సోకినట్లు తెలిసింది. అయితే ఆయన సతీమణి శ్రీమతి కస్తూరమ్మ(60) కరోనాకి చికిత్స పొందుతూ గుండెపోటుతో కన్నుమూసింది. ఆమె తెలుగుదేశంపార్టీ అనుబంధశాఖ తెలుగు మహిళ క్రిష్టియన్ విభాగానికి జిల్లా అధ్యక్షు రాలుగా వుంది. భార్య మృతితో పరసా దుఃఖంలో మునిగిపోయాడు. అప్పటికే అనా రోగ్యంతో వున్న ఆయన సతీమణి అంత్యక్రియలలో పాల్గొని భోరుమని విలపించాడు.

ప్రస్తుతం పరసారత్నం కూడా తిరుపతిలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఆయన పరిస్థితి కూడా ఆందోళనకరంగానే ఉందని, వారి ఇతర కుటుంబసభ్యులు క్వారంటైన్ సెంటర్లో వున్నారని ఆయన అనుచరులు చెప్తున్నారు.


సతీ వియోగంతో శోకసముద్రంలో వున్న పరసా వెంకటరత్నంకి ప్రగాఢ సానుభూతిని తెలుపుతోంది 'లాయర్'.

# మట్టి వినాయక ప్రతిమలనే పూజిద్దాం

వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టి వినాయక ప్రతిమలనే పూజించాలని, తద్వారా కాలుష్యరహితంగా, పర్యావరణ హితంగా వినాయక చవితిని జరుపుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.ప్రమోద్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈనెల 19న ఆయన నెల్లూరులోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వినాయక చవితి పండుగలో ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో చేసిన విగ్రహాలు కాకుండా మట్టి వినాయక ప్రతిమలను పూజించుకోవాలన్నారు. రంగులు, రసాయనాలతో చేసిన విగ్రహాలు పర్యావరణాన్ని కలుషితం చేస్తాయని, వీటి వల్ల మనుషులకే కాక జలచరాలకు కూడా ప్రమాదకరమని అన్నారు. విగ్రహాల అలంకరణలో, పూజా సామగ్రిలో ప్లాస్టిక్ లేకుండా చూడాలన్నాడు. కోవిడ్ నిబంధనలు పాటిస్తూ పండుగను ఇళ్లలోనే జరుపుకోవాలని, బహిరంగప్రదేశాల్లో విగ్రహాలు ఏర్పాటు చేయరాదని సూచించాడు. బహిరంగ వేడుకలు నిషిద్ధమన్నారు.

# 'స్వచ్ఛత'.. పటిష్టవంతంగా ఉండాలి

- విఎస్‌యు వీసీ సుదర్శన్‌రావు



విఎస్‌యు పరిధిలోని అనుబంధ కళాశాలల్లో 'స్వచ్ఛత' కార్యక్రమాన్ని పటి ష్టంగా అమలుచేయాలని విఎస్‌యు వీసీ సుదర్శనరావు అన్నాడు. ఈనెల 19న ఆయన ఈ కార్యక్రమ కార్యాచరణ ప్రణాళికపై ఆన్‌లైన్ వర్క్‌షాపు నిర్వహించి మాట్లాడుతూ కళాశాలల్లో స్వచ్ఛత కార్యక్ర మాలను నిర్వహించడం ద్వారా ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువు కునేందుకు వీలుకల్పించినట్లవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ విశ్వ విద్యాలయం ఉపకులపతి ఎంఎం నాయక్, మహాత్మాగాంధీ నేషనల్ కౌన్సిల్ ఫర్ రూరల్ ఎడ్యుకేషన్ ఛైర్మెన్ డాక్టర్ ప్రసన్నకుమార్, ఏపి నోడల్ అధికారి డాక్టర్ మహేంద్ర, యూనివర్శిటీ కోఆర్డినేటర్ డాక్టర్ మధుమతి, యూనివర్శిటీ కళాశాల ప్రిన్సిపాల్ సుజా ఎస్ నాయకర్, ఎంజిఎన్‌సిఆర్ఈ సమన్వయకర్తలు సాయికిరన్, డాక్టర్ కె.సునీత, డాక్టర్ నీల మణికంఠ, డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ సుజాత, ప్రసన్న, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

# 27 వరకు రేషన్ పంపిణీ

కరోనా నేపథ్యంలో ఈనెల 19 నుంచి 27వ తేదీ వరకు రేషన్‌కార్డుదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయనున్నామని డిఎస్‌ఓ బాలకృష్ణారావు ఈనెల 18న ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. 10వ విడత ఉచిత రేషన్ పంపిణీ కార్యక్రమంలో భాగంగా ఒక్కో కార్డుదారునికి కేజీ శన గలు, కార్డులోని ఒక్కో సభ్యునికి 5కిలోల బియ్యం పంపిణీ చేస్తామన్నారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల దాకా పంపిణీ ఉంటుందని, కార్డుదారులు చౌక దుకాణాల వద్ద మాస్కులు ధరించి భౌతిక దూరం పాటించాలని తెలిపాడు.

# ఉపాధి లక్ష్యాలు సాధించకుంటే చర్యలు

జిల్లాలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు సాధించకుంటే చర్యలు తప్పవని డ్వామా ఇన్‌చార్జి పీడీ, జడ్పీ సిఇఓ సుశీల ఏపిడిఓలను, ఏపిఓలను, ఫీల్డ్ అసిస్టెంట్లను హెచ్చరించారు. ఈనెల 19న ఆమె వారితో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఉపాధి హామీ పథకం, కూలీల సంఖ్య, హార్టికల్చర్ ప్లాంటేషన్, పేదలకు ఇళ్ళస్థలాల పంపిణీలకు సంబంధించిన విషయాలపై ఆమె వారితో మాట్లాడుతూ ఉపాధి పనులకు సంబంధించిన కూలీల సంఖ్యను పెంచాలన్నారు. కాలనీల్లో రోడ్ల పక్కన మొక్కలు నాటే కార్యక్రమం లక్ష్యాల మేరకు త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. నర్సరీల నుంచి మొక్కలు తెప్పించుకుని వాటిని నాటి, పరిరక్షించాలన్నారు. అధికారులతో సమన్వయం చేసుకుని లక్ష్యాల సాధనకు అందరూ కృషిచేయాలని ఆమె చెప్పారు.

# రోడ్డు ప్రమాదంలో తండ్రీ కొడుకులు మృతి

**సినీ పంపిణీదారులు కమలాకర్‌రెడ్డి, ఆయన తండ్రి నందగోపాల్‌రెడ్డి**



అనారోగ్యంతో బాధపడుతున్న తండ్రికి మెరుగైన వైద్యం అందించాలని ఓ ప్రైవేట్ అంబులెన్స్‌లో హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో ఆ తండ్రీ కొడుకుల్ని మృత్యువు కాటేసింది. ఈ ఘటనలో తండ్రి గుండాల నందగోపాల్‌రెడ్డితో పాటు, కుమారుడు గుండాల కమలాకర్‌రెడ్డి మరణించారు. ఈ దుర్ఘటన ఈనెల 19న జరిగింది. దీంతో వీరి స్వస్థలమైన బుచ్చిరెడ్డిపాళెం మండలంలో విషాదఛాయలు కమ్ము కున్నాయి. కమలాకర్‌రెడ్డి పలు చిత్రాలకు పంపిణీదారుడుగా, సహనిర్మాతగా ప్రఖ్యాతి గాంచాడు. తన తండ్రి కరోనా బారిన పడడంతో మెరుగైన వైద్యచికిత్సం కోసం తీసుకువెళ్తుండగా వీరు వెళ్తున్న అంబులెన్స్ నల్గొండ సమీపంలోని కొండ్రపోల్ వద్ద ఆగివున్న లారీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం జరిగింది. నెల్లూరుజిల్లాలోని బుచ్చిరెడ్డిపాళెం సమీపంలో ఉన్న రేబాల గ్రామానికి చెందిన ప్రముఖ నిర్మాత, కెఎఫ్‌సి నిర్మాణసంస్థ ప్రతినిధుల్లో ఒకరైన గుండాల కమలాకర్‌రెడ్డి(48), ఆయన తండ్రి నందగోపాల్‌రెడ్డి(75) ఈ దుర్ఘటనలో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతిచెందడం పట్ల సర్వత్రా విషాదం నెలకొంది. అంబులెన్స్ డ్రైవర్‌కు కూడా తీవ్రగాయాలు కావడంతో ఆయన్ను హైదరాబాద్‌కు తరలించారు. ఇటీవల విడులైన 'కనులు కనులు దోచాయంటే' సినిమాను కెఎఫ్‌సి ఎంటర్‌టైన్‌మెంట్ విడుదల చేసింది. ఈ సినిమాకు కో-ప్రొడ్యూసర్‌గా కమలాకర్‌రెడ్డి వ్యవహరించాడు. అంతేకాదు, తెలుగులో అర్జున్‌రెడ్డి, ఏజెంట్ సాయిశ్రీనివాస ఆత్రేయ సినిమాల నిర్మాణంలో కూడా ఆయన ప్రధానపాత్ర పోషించాడు. పలు తెలుగు, హిందీ, తమిళ డబ్బింగ్ సినిమాలకు కూడా ఆయన డిస్ట్రిబ్యూటర్‌గా ఉన్నాడు. వీరి మృతితో జిల్లా సినీ పరిశ్రమలో విషాదం అలముకుంది.

# అర్హులందరికీ బియ్యం కార్డులు

- జిల్లా పౌరసరఫరాల అధికారి బాలకృష్ణ



జిల్లాలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం బియ్యం కార్డులను మంజూరు చేస్తోం దని, రేషన్‌కార్డులు లబ్ధిదారు లకు ఇచ్చే విషయంలో రెవెన్యూ సిబ్బంది ఎలాంటి అలసత్వం చూపకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా పౌరసరఫరాల అధికారి బాలకృష్ణ స్పష్టం చేశారు. ఈనెల 18న ఆయన వెంకటాచలం మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది, డీలర్లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత కార్డులు, కొత్త కార్డు దారులకు సంబంధించి ఇకెవైసీ చేయడంలో రెవెన్యూ సిబ్బంది నిర్లక్ష్యం చూపుతుం డడం ఏమిటని ప్రశ్నించారు. ప్రతి మండలంలో ఈ ప్రక్రియ సాగుతుంటే ఒక్క వెంకటాచలం మండలంలోనే ఎందుకు చేయడం లేదని మండిపడ్డారు. రెవెన్యూ సిబ్బంది పనితీరు మార్చుకోకుంటే చర్యలు తప్పవన్నారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## గురుబ్రహ్మయ్య మృతి తీరని లోటు


- బిజెపి నాయకుల సంతాపం

బిజెపి జిల్లా సీనియర్ నాయకుడు మాదన గురుబ్రహ్మయ్య మృతి పార్టీకి తీరని లోటని బిజెపి నాయకుడు నరేంద్రరెడ్డి ఈనెల 19న ఒక ప్రకటనలో పేర్కొన్నాడు. ఆయన ఎన్నో ఏళ్లపాటు గూడలి సర్పంచ్‌గా పనిచేశాడని అంటూ గురుబ్రహ్మయ్య కుటుంబసభ్యులకు తమ ప్రగాఢ సాను భూతిని తెలియజేశాడు.

## డిఆర్‌డిఏ పీడీగా రోజ్‌మాండ్

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డిఆర్ డిఏ) ఇన్‌చార్జి పీడీగా సివిల్ సప్లయిస్ డిఎం రోజ్‌మాండ్‌ను నియమిస్తూ జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు ఈనెల 19న ఉత్త ర్వులు జారీచేశారు. డిఆర్‌డిఏ పీడీగా పనిచేస్తున్న శీనానాయక్‌ను రెవెన్యూశాఖకు బదిలీ చేశారు.

# శ్రద్ధాంజలి



జననం : 19.03.1930 మరణం : 07.08.2020

నిరంతర ప్రజా సేవకుడు.. నిస్వార్థ నిష్కల్మష నాయకుడు

## తిక్కవరపు బలరామరెడ్డి గారు

తే. 07.08.2020ది శుక్రవారం నాడు పరమపదించినారు.

*వారి పవిత్ర ఆత్మశాంతికై ప్రార్థిస్తూ...*

భార్య : **తిక్కవరపు హైమావతమ్మ**

కుమారులు - కోడళ్ళు

**టి.సీతారామిరెడ్డి - అనిత**

**టి.రామచంద్రారెడ్డి - సుజల**

కుమార్తెలు - అల్లుళ్ళు

**వేణుంబాక కమల - దినేష్‌రెడ్డి,** మాజీ డి.జి.పి., ఆంధ్రప్రదేశ్

**మారంరెడ్డి షీల - శివకుమార్‌రెడ్డి**

మనుమరాళ్ళు, మనుమలు

**సునయన, దిత్య, పూజిత, సంజన**

**రోహిత్, రితేష్, చేతన్**

మరియు

**మునిమనుమలు**

**మునిమనుమరాళ్ళు**

**ఉత్తరక్రియలు :** వారి ఉత్తరక్రియలు **తే. 27.08.2020ది** గురువారం ఉదయం 9గంటలకు నెల్లూరుజిల్లా, ఇందుకూరుపేట మండలం, మైపాడు గ్రామంలోని వారి స్వగృహమునందు జరుగును. బంధుమిత్రులకు తెలియజేయడమైనది.

## 'ప్రభా'తం

# కూతుళ్ళకు ఆస్తి హక్కు

**కొడుకులతో సమానంగా కూతుళ్లకూ ఆస్తిలో సమానహక్కు ఉంటుందని సుప్రీంకోర్టు తాజాగా ఇచ్చిన తీర్పు చరిత్ర త్మాకమైనది, సంతోషకరమైనది కూడా! దీంతో దేశంలో కోట్లాదిమంది ఆడపిల్లలకు న్యాయం జరుగుతుందని వేరే చెప్పనక్కరలేదు. సమాజంలో స్త్రీల పట్ల వివక్ష, ఆడపిల్లల హక్కుల పట్ల అలక్ష్యం పెరిగిపోతున్న నేటికాలంలో ఈ తీర్పు ఆడపిల్లల జీవితాలకో ఆసరాగా.. వారి జీవనయాత్రలో ఒక మేలిమలుపుగా నిలుస్తుందనుకోవచ్చు. అందుకే ఈ తీర్పు వారికే కాదు.. నేటి సమాజానికీ.. దేశానికే శుభకరం.!**

తండ్రి మరణించినప్పటికీ వారసత్వంగా ఆస్తిని పొందే హక్కు కుమార్తెకు ఉంటుంది. కొడుకు వివాహమయ్యేవరకే కొడుకుగా ఉంటాడు. కూతురు మాత్రం జీవితాంతం తండ్రిని ప్రేమించే కూతురుగానే ఉండిపోతుంది. ఆస్తిలో జీవితాంతం సహభాగస్వామిగా ఉంటుంది. కుమారుడు మాదిరిగానే కుమార్తె కూడా పుట్టుకతోనే ఆస్తికి వారసురాలు అవుతుందంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తాజాగా చెప్పిన తీర్పు ఎంతో చరిత్రాత్మకమైనది. సవరించిన హిందూ వారసత్వ హక్కు చట్టం ప్రకారం..కొడుకులతో సమానంగా కూతుళ్లకూ ఆస్తిలో సమానహక్కు ఉంటుందని ఇచ్చిన తీర్పు ఎంతో సంతోషదాయకమైనది కూడా. జస్టిస్ మిశ్రా నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం ఇచ్చిన ఈ తీర్పుతో దేశంలో కోట్లాదిమంది ఆడపిల్లలకు న్యాయం జరుగుతుందని వేరే చెప్పనక్కరలేదు.

మనదేశంలో స్త్రీ పురుష సమానత్వాన్ని సాధించేందుకు ప్రభుత్వాల తరపున ఎంతో కాలంగా ఎన్నో ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నా.. ఆచరణకు వచ్చేసరికి అవన్నీ కేవలం నినాదప్రాయమైన ఆదర్శాలుగా నిలిచిపోతూ ఉండడం చూస్తూనే ఉన్నాం. సమాజంలో స్త్రీల పట్ల వివక్ష ఎంతోకాలం నుంచి కొనసాగుతూనే ఉంది. ఇంటాబయటా మహిళలకు అన్ని విధాలా అన్యాయమే జరుగుతోంది. ఎక్కడ చూసినా స్త్రీలు, మహిళల పట్ల అనునిత్యం అరాచకాలు, అన్యాయాలు జరిగిపోతూనే ఉన్నాయి. ఈ దారుణాలు నానాటికీ పెరిగిపోతూనే ఉన్నాయి. స్త్రీలకంటూ కొన్ని హక్కులు ఉన్నా అవన్నీ కూడా నేటి సమాజంలోనూ నామ మాత్రమే అవుతున్నాయి. ఎంతో సున్నితహృదయులైన ఆడపిల్లల హక్కులపట్ల ఎంతోకాలంగా నిర్లక్ష్యమే చూపుతోంది సమాజం. ఆస్తి అంటే అది కొడుకులకు మాత్రమే దక్కే సంపద అన్న అభిప్రాయం ఎంతో కాలంగా సమాజంలో స్థిరపడిపోయింది. ఆడపిల్లలు పుడితే గుండెలమీద కుంపటేనన్నట్లుగా భావించే వారూ లేకపోలేదు. దీంతో ఆడపిల్లగా పుట్టడం కన్నా అడవిలో మానై పుట్టడం మేలనే పాతకాలం నాటి మాట.. నేడెంత ఆధునిక కాలం వచ్చిందనుకుంటున్నా నేటికీ మారడమే లేదు. ఎక్కడైతే స్త్రీలను గౌరవించి పూజిస్తారో అక్కడ దేవతలు కొలువైవుంటారని ఘనంగా చెప్పుకునే మనదేశంలోనూ స్త్రీల పట్ల వివక్ష అనేకరూపాల్లో కొనసాగుతూనే ఉండడం బాధాకరం. అయినప్పటికీ ఎంతోమంది సంఘసంస్కర్తల కృషి, మరోవైపు ప్రభుత్వాలు ఇస్తున్న తోడ్పాటుతో ఇటీవలి కాలంలో మహిళలు అన్నిరంగాల్లో అద్వితీయంగా రాణిస్తుండడం శుభపరిణామం. విద్యలో తాము సరస్వతీపుత్రికలమంటూ విశేష ప్రజ్ఞాపాటవాలతో పురుషుల కంటే కూడా అనేకచోట్ల ముందంజలో ఉంటున్నారు కూడా. ఉపాధిపరంగా అనేక రంగాల్లోనూ చేరి ప్రతిభాపాటవాల్లో మహిళలేమీ తక్కువకాదని నిరూపించుకుంటున్నారు. అత్యంత సాహసోపేతమైన సైనిక రంగంలోనూ తమ సత్తా చాటుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఆడపిల్లలకు ఎంతో ఊరటనే కాదు..మరింత సంతృప్తిని కూడా కలిగిస్తోంది. దేశవ్యాప్తంగా ఆ తీర్పు ఎందరో ఆడపిల్లల జీవితాలకు వెలుగుబాటలు పరిచేదిగా ఉండడమే ఇందుకు కారణం.

హిందూ అవిభక్త కుటుంబ ఆస్తులకు కుమారులతో పాటు కుమార్తెలు కూడా సమాన హక్కుదారులేనంటా సుప్రీంకోర్టు ఆ తీర్పులో స్పష్టం చేసింది. కుమార్తెలకు సమానత్వ హక్కును దక్కకుండా చేయడం కుదరదని తేల్చిచెప్పింది. అంతేకాదు, హిందూ వారసత్వ (సవరణ) చట్టం-2005 అమల్లోకి రావడానికి ముందునుంచీ ఇది వర్తిస్తుందని, 2005 సెప్టెంబర్ 9వ తేదికి ముందు పుట్టిన కుమార్తెలు కూడా అవిభాజ్య కుటుంబ ఆస్తులకు సమానహక్కుదారులేనని స్పష్టీకరించింది. అప్పటికి వారి తండ్రి జీవించి ఉండాల్సిన అవసరం లేదని కూడా తేల్చింది. కుమారుడు మాదిరిగానే కుమార్తె కూడా పుట్టుకతోనే వారసురాలు అవుతుందని పేర్కొంది. 2005 నాటి సవరణ చట్టంలో ఇది ఎప్పటినుంచి వర్తిస్తుందన్న విషయమై సరైన వివరణ లేదని వచ్చిన పిటిషన్లను విచారించి సుప్రీం ధర్మాసనం తాజాగా ఈనెల 11న ఈ అద్భుతమైన తీర్పు చెప్పింది. హిందూ వారసత్వ హక్కు సవరణ చట్టం-2005లోని సెక్షన్-6 నిబంధనల ద్వారా కుమార్తెలకు కూడా వారసత్వ ఆస్తిలో సమానహక్కులు కల్పించింది. ఈ సవరణ చట్టం అంతకుముందునుంచే వర్తిస్తుంది కాబట్టి 2005కు ముందు పుట్టిన కుమార్తెలు కూడా వారసత్వ ఆస్తికి సమాన హక్కుదారులేనంది.

అంతేకాదు, కుమార్తెలు ఎప్పుడు జన్మించినా వారు ప్రేమించే కుమార్తెలుగానే ఉంటారని సుప్రీం ధర్మాసనం ఈ సందర్భంగా వ్యాఖ్యానించడం విశేషం. 'కుమారుడు పెళ్ళయినంతవరకే కుమారుడని.. కుమార్తె మాత్రం జీవితాంతం తండ్రిని ప్రేమించే కుమార్తెగానే ఉంటుందని 2018 నాటి వ్యాఖ్యలను మరోసారి సుప్రీంకోర్టు గుర్తుచేసింది. వారసత్వ ఆస్తి హక్కు పుట్టుకతోనే వచ్చేది కాబట్టి 2005లో చట్ట సవరణ చేసేనాటికి (2005, సెప్టెంబరు9) తండ్రి జీవించి ఉన్నాడా లేదా అనే విషయంతో నిమిత్తం లేకుండా కూతుళ్ళకు ఆజన్మాంతం ఈ హక్కు ఉంటుందని ధర్మాసనం నొక్కిచెప్పింది. ఇంతకాలం న్యాయపరమైన సంక్లిష్టత కారణంగా కుమార్తెల ఆస్తిహక్కు విషయంలో దాఖలైన పిటిషన్లు న్యాయస్థానాల వద్ద అపరిష్కృతంగానే ఉన్నాయని, ఇక కోర్టులు ఆలస్యం చేయకుండా ఆ కేసులన్నిటినీ ఆరునెలల లోపు వీలైనంత త్వరగా పరిష్కరించాలని, అప్పీళ్ళు, పిటిషన్లు పరిశీలించి కుమార్తెలకు సమాన వాటా అందిస్తూ వాటిని పరిష్కరించాలని సుప్రీంకోర్టు ధర్మాసనం ఆదేశించింది.

దేశానికి 74వ స్వాతంత్ర్యదినోత్సవం మరో నాలుగురోజుల్లో ఉందనగా ఈ సంతోషకరమైన తీర్పు (ఆగస్టు 11) రావడం యాదృచ్ఛికమే కావచ్చు గాక, తాము కూడా మగపిల్లలతో సమానమేనని, ఆస్తిలో తమకు కూడా హక్కు ఉందని ఆడపిల్లలు ధీమాగా చెప్పుకునేవిధంగా తీర్పు రావడం ఈ స్వాతంత్ర్యదినోత్సవపు శుభవేళ ఎంతైనా విశేషమే మరి!..

ఇది ఆడపిల్లల జీవితాలకో ఆసరాగా.. వారి జీవనయాత్రలో చెప్పుకోదగ్గ మలుపుగా నిలుస్తుందని వేరే చెప్పనక్కర లేదు. ఏదేమైనా ఈ తీర్పు ఆడపిల్లలకే కాదు, నేటి సమాజానికీ.. దేశానికే శుభకరం.

## చాముండేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్న అధికారులు

అష్టాదశ శక్తిపీఠాల్లో ఒకటైన ఇందుకూరుపేట మండలంలోని గంగపట్నంలో వెలసివున్న శ్రీ చాముండేశ్వరిదేవి అమ్మవారిని ఈనెల 16న జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జున, ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్‌లు దర్శించుకుని ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పొత్తూరు సుధీర్‌కుమార్‌శర్మ, మాచవోలు రామకృష్ణ, నూతలపాటి అనిల్‌కుమార్, పాలకమండలి ఛైర్మెన్ కొండూరు కృష్ణారెడ్డి, ఇఓ రవీంద్రరెడ్డి తదితరులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వైకాపా రాష్ట్ర రైతుసంఘం నాయకుడు మావులూరు శ్రీనివాసులురెడ్డి, నాయకులు పంబాల జనార్ధన్, మహీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కుళ్లిన చికెన్ చాటున.. మద్యం సీసాలు

**ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు**

కుళ్లిపోయిన చికెన్ వ్యర్థాల చాటున వంద మద్యం సీసాలను తీసుకువెళ్తున్న ముగ్గుర్ని పోలీసులు పట్టుకున్నారు. కర్నాటక నుంచి పొదలకూరు మీదుగా బుచ్చిరెడ్డిపాళెం వద్ద చికెన్ వ్యర్థాలతో వెళ్తున్న వాహనాన్ని పోలీసులు తనిఖీచేసి వాటి కింద దాచిపెట్టివున్న మద్యం సీసాలను వెలికితీశారు. నిందితులైన దేవరకొండ వెంకటేశ్వర్లు, దాసరి సురేష్, మణిలపై ఎక్సైజ్ చట్టం ప్రకారం కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పొదలకూరు సిఐ గంగాధర్‌రావు పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఐ రహీంరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ బాషా, పోలీసు సిబ్బంది రమేష్, సురేష్, ప్రసాద్‌లను ఈ సందర్భంగా సిఐ అభినందించారు.

## ప్రైవేట్ టీచర్లకు కానిస్టేబుల్ వితరణ

కావలి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న అయోధ్యకుమార్ తన కుమారుడు సాద్విక్ పుట్టినరోజు సందర్భంగా ఈనెల 16న కావలి పట్టణంలోని పలు ప్రైవేట్ ఉపాధ్యాయులకు నిత్యావసర సరుకులు పంపిణీచేసి తమ సేవాభావం చాటుకున్నాడు. కరోనా నేపథ్యంలో ఉపాధి కోల్పోయి అవస్తలు పడుతున్న ఉపాధ్యాయులకు తమవంతు సాయం అందించి అందరి అభినందనలు అందుకున్నాడు. ఈ కార్యక్రమంలో వెంకటసాయి, తేజ, కృష్ణ, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మన దేవాలయాలను అక్షరాలలో దర్శింపజేస్తున్నారు

'లాయర్' పత్రికలో మీరు ప్రారంభించిన 'మన దేవాలయాలు' శీర్షిక చాలా బాగుంది. అత్యంత పురాతన దేవాలయాలను అక్షరాలతోనే దర్శింపజేస్తున్నారు. నెల్లూరు దేవాలయాలకు ఒక ప్రత్యేక చరిత్ర వుంది. పరిశీలనాత్మకంగా దర్శించుకోగలిగితే అనేక ఆసక్తికర విషయాలు మనకు తెలుస్తాయి. ఒక్కొక్క వారం ఒక్కొక్క దేవాలయాన్ని గురించి తెలియజేస్తూ ఆయా దేవాలయాలను ప్రత్యక్షంగా దర్శించుకున్న అనుభూతిని కల్పిస్తున్నారు. మాది నెల్లూరుజిల్లా రాపూరు. గత 10 సంవత్సరాలుగా అమెరికాలో మా అమ్మాయి దగ్గర ఉంటున్నాను. నెల్లూరు విశేషాలను ప్రతీ వారం లాయర్ ద్వారా తెలుసుకుంటుంటే నెల్లూరులోనే వున్న అనుభూతి కలుగుతోంది. మీకు నా అభినందనలు.

**ఎన్. రమేష్‌నాయుడు,**
**శాండియాగో, కాలిఫోర్నియా.**

ఈ-మెయిల్ ప్రజావాణి
roopagroup@yahoo.com

## కొవిడ్‌లో కూడా కులాలు అవసరమా..?

సినిమా హీరో రామ్ పోతినేని సామాజిక మాధ్యమాలలో చేస్తున్న చిల్లర కామెంట్లు అర్ధరహితంగాను, పిల్ల తరహాగానూ వున్నాయి. ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న కరోనా రోగాన్ని అడ్డంపెట్టుకుని తనకున్న కుల జబ్బును బహిర్గతం చేశాడు. కరోనా వైరస్ కంటే కుల వైరస్ ప్రమాదకరమైనది అంటూ వ్యాఖ్యానించి, తనకున్న కుల పిచ్చిని బయట పెట్టుకున్నాడు.

విజయవాడ స్వర్ణాప్యాలస్ దుర్ఘటనలో రమేష్ ఆసుపత్రి చేసిన దురాగతాలు, దుర్మార్గాలు ఆధారాలతో సహా ఒక్కొక్కటిగా బయటపడుతుంటే, తన దగ్గర బంధువైన డాక్టర్ రమేష్‌ని కాపాడడానికి కులాన్ని తెరపైకి తెచ్చిన రామ్ వ్యవహార శైలి గమనిస్తే, కులవిద్వేషాలు రెచ్చగొట్టి అసలు విషయాన్ని పక్క ద్రోవ పట్టించి తన బంధువును రక్షించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు స్పష్టంగా అర్ధమవుతోంది.

ఇలా కోవిడ్‌కి కూడా కులాన్ని అడ్డంపెట్టి తమ బంధువును చేసిన నేరం నుండి తప్పించాలని చూడ్డం రామ్‌కే చెల్లింది.

**ఆర్. ప్రీతమ్‌రెడ్డి, హైదరాబాదు.**

## పోలీసులూ!.. ఈ ఆకతాయిల ఆటకట్టించండి

విడవలూరులోని సాయిబాబాగుడి సమీపంలో ఆకతాయిల బెడద పెరిగిపోయింది. తాగుబోతులంతా చేరి ఇక్కడ అల్లరి చేస్తున్నారు. పులిమేకా, చింతపిక్కలాట, పేకాట, బెట్టింగ్‌ల జోరు ఎక్కువగా ఉంది. అర్ధరాత్రివేళ కూడా వీరంగం చేస్తూ మద్యంబాబులు చిందులు వేస్తున్నారు. అందరూ ఇళ్లలో నిద్రిస్తున్న సమయంలో తలుపులు తట్టడం, పరుగులు తీయడం చేస్తూ అందరినీ భయభ్రాంతుల్ని చేస్తున్నారు. ఇక్కడున్న కొన్ని దుకాణాలు వారికి సెంటరుగా మారాయి. ఆ దోవన పోయే ప్రజలను నీచమైన పదజాలంతో దుర్భాషలాడుతూ అల్లరిపెడుతున్నారు.

పోలీసులు వీరిపై నిఘాపెట్టి ఈ ఆకతాయిల ఆగడాలను అరికట్టాలని కోరుకుంటున్నాం.

**– పవన్, విడవలూరు మండలం.**

లాయర్
పాఠకులకు మనవి
మా(మీ) లాయర్ పత్రికకు
సమాచారం / లేఖలు
పంపదలచిన వారు
9866314741 నంబరుకు
వాట్సయాప్ ద్వారా గాని, లేదా
roopagroup@yahoo.comకి
ఈ-మెయిల్ ద్వారా గాని
పంపవలసిందిగా విజ్ఞప్తి.
పోస్టల్ చిరునామా :
ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు,
మాగుంట లే అవుట్, నెల్లూరు - 3.
- సం/-

# వలసలతో పలసన

- బతుకుదారి లేక ఇంటిదారి పట్టిన కష్టజీవులు
- నగరంలో ఖాళీఅయిపోతున్న అద్దె ఇళ్ళు



**కరోనా రాకాసి అన్ని వర్గాల ప్రజల జీవితాలను, జీవనాలను అస్తవ్యస్తం చేస్తూనే ఉంది. నగరంలో నివాసం ఉంటూ వివిధ రంగాల్లో పనిచేస్తున్న వలసజీవులు కరోనా దెబ్బతో పనులు లేక తిరిగి తమ సొంత ఇళ్ళకు వెళ్ళిపోవడంతో.. వేలాది అద్దె ఇళ్ళు ఖాళీ అయిపోతున్నాయి. దీంతో నగరం పలసబడి.. బోసిపోయినట్లు కనిపిస్తోంది. నెల్లూరులో ఇప్పటికే 20 వేల ఇళ్ళ దాకా ఖాళీ కాగా, మిగిలిన అద్దె ఇళ్ళు కూడా ఖాళీబాట పడుతుండడంతో ఇళ్ళ యజమానుల పరిస్థితి కూడా అయోమయంలో పడింది.**

జిల్లాలోని అనేకప్రాంతాల నుంచి, జిల్లాయేతర ప్రాంతాల నుంచి కూడా నెల్లూరు నగరానికి జీవనోపాధికోసం ఎంతోమంది కార్మికులు, కష్టజీవులు, ఉద్యోగులు ఎంతోకాలం నుంచి ఇక్కడ అద్దెఇళ్ళల్లో ఉంటూ పనులకు వెళ్ళి వచ్చే వారు. వీరంతా కొందరు నెలజీతంతో బతికేవారైతే, మరికొంతమంది ఏరోజుకారోజు పనిచేసి ఆ వచ్చే డబ్బులతో కుటుంబాలను పోషించుకునేవాళ్ళు. వీరి సంఖ్య ఎంతో భారీగానే ఉంటుంది. అయితే, కరోనా ప్రభావంతో అనేక రంగాలు పనులు లేక మూతపడడంతో తమ కుటుంబాలు జరక్క ఇళ్లకు అద్దెలు చెల్లించలేక పడే బాధలు వర్ణనాతీతం.

జిల్లాలోని అనేక పరిశ్రమల్లో ఉపాధి కోసం వలస వచ్చిన కార్మికులు, ఉద్యోగులు, ఎంతో నైపుణ్యం గల కష్టజీవులు వేలాదిమంది ఆయా పరిశ్రమలు మూతపడడం వల్ల తిరిగి వారు స్వస్థలాలకు వెళ్లిపోయారు. అలా వెళ్లిపోయిన వారి సంఖ్య కూడా వేలల్లోనే ఉంటుంది. ఆ పరిశ్రమల్లో పనిచేసేవారు కూడా ఎక్కువ మంది నగరంలోనే అద్దె ఇళ్ళల్లో ఉండే వారు. ఇలా నగరానికి వలసలు వచ్చిన వారంతా కరోనా ప్రభావంతో ఇక గత్యంతరం లేని పరిస్థితుల్లో ఇప్పటిదాకా తామున్న అద్దె ఇళ్ళు ఖాళీ చేసి తిరిగి తమ సొంత ఊళ్లకు, ఇళ్ళకు వెళ్లిపోతుండడంతో నగరంలో అనేక ప్రాంతాలు పలసబడ్డాయి. మరోవైపు విద్యాలయాలన్నీ ఆన్‌లైన్ బాట పట్టడం, కొంతమంది ఉద్యోగులు మాత్రం ఇళ్ళ వద్ద నుంచే 'వర్క్ ఎట్ హోమ్'కు ప్రాధాన్యత ఇస్తుండడంతో ఎవరిళ్ళకు వాళ్ళు వెళ్ళి అక్కడ నుంచే పని చేస్తూ తమ ఉద్యోగాలు కాపాడుకుంటున్నారు. ఈ వెసులుబాటు లేని వారి పరిస్థితి మాత్రం దయనీయంగానే ఉంది. చదువుల కోసం జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి కూడా నగరానికి వచ్చి ప్రైవేట్ విద్యాలయాల్లో చేరి అద్దెఇళ్ళల్లో, అద్దె గదుల్లో ఉంటూ చదువుకునే వారు ఎంతోమంది ఉన్నారు. ఆయా విద్యాలయాల సమీపంలో చిన్న గది దొరకాలంటేనే ఒకప్పుడు గగనంగా ఉండేది. దానికి కూడా వేలాదిరూపాయల బాడుగ ఉండేది. ఇప్పుడు నగరంలోని అనేక ప్రైవేట్ విద్యాలయాలు మూతపడడంతో ఆ విద్యార్థులంతా తమ స్వస్థలాలకు వెళ్ళిపోయారు. దీంతో నగరానికి కళ తప్పినట్లుగా కనిపిస్తోంది.

అదేవిధంగా నగరంలోని పెద్ద పెద్ద హోటళ్ళు, కల్యాణమండపాలు, సినిమా థియేటర్లు వగైరాలన్నీ మూతపడిపోవడంతో వాటిలో పనిచేసే వేలాదిమంది వలస జీవులు వెళ్ళిపోవడంతో నగరంలోని అద్దె ఇళ్ళు పెద్దసంఖ్యలో ఖాళీ అయిపోతున్నాయి. ఇళ్ళు, భవనాల నిర్మాణ రంగంలో పనిచేసే మేస్త్రీలు, ప్లంబర్లు తదితర నైపుణ్యం గల కార్మికులంతా వెళ్లిపోతున్నారు. దీంతో ఇప్పుడు ఉన్నవారికే డిమాండ్ బాగా ఉంటోంది కానీ, కరోనా దెబ్బతో ఇక్కడ ఇళ్ళ నిర్మాణాలు కూడా మందకొడిగానే సాగుతున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వలస వచ్చిన నిపుణులు అనేకమంది వెళ్లిపోవడంతో విద్యుత్ రంగం, పరిశ్రమల రంగాల్లో నిపుణుల కొరత ఏర్పడింది. వీళ్ళు కూడా జిల్లాలో ఏ ప్రాంతంలో పనిచేసినా ఎక్కువమంది నగరంలోనే నివసించేవారు. అందరూ అలా వెళ్ళిపోతుండడంతో నగరంలో ఆ వెలితి కనిపిస్తోంది.

## ఎక్కడ చూసినా 'టు లెట్' బోర్డులే :

ఇప్పటిదాకా నగరంలో సుమారు 20వేలకు పైగానే అద్దె ఇళ్ళు ఖాళీ అయిపోయివుంటాయని అంచనా. దీంతో నగరంలో ఏ వీధి చూసినా 'టు లెట్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ప్రధాన వీధుల్లో ఉన్న అనేక పెద్దపెద్ద అద్దె ఇళ్ళన్నిటికీ 'టు లెట్' బోర్డులు వేలాడుతున్నాయి. గతంలో నగరంలో ఇళ్ళు అద్దెకు దొరకాలంటేనే చాలా కష్టంగా ఉండేది. పెద్దమొత్తంలో అడ్వాన్సులు ఇస్తే తప్ప ఇళ్ళు దొరికేవి కావు. మారుమూల సందులు గొందుల్లో కూడా అద్దె ఇళ్ళకు వేలాది రూపాయలు బాడుగ ఉండేది. ఇప్పుడా పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కరోనా దెబ్బతో ఇల్లు అద్దెకు ఇస్తామన్నా వచ్చి చేరేవాళ్ళు లేరు. దీంతో ఇళ్ళ యజమానుల పరిస్థితి కూడా అయోమయంగా మారింది. దుకాణాల్లో వ్యాపారాలు జరక్క అనేక దుకాణాలు కూడా మూతబడ్డాయి. వాటిలో పనిచేసే ఎంతోమంది వలసజీవులు కూడా తమ సొంతగూళ్ళకు వెళ్ళిపోవడంతో అనేక దుకాణాలకు కూడా 'టు లెట్' బోర్డులు వేలాడుతున్నాయి. నెల్లూరు నగరంలో దాదాపు లక్ష 50వేల దాకా నివాసగృహాలు ఉంటే, వీటిలో అద్దె ఇళ్ళు సుమారు 50వేలకు పైగానే ఉంటాయని, వీటిలో ఇప్పటికే 20 వేల ఇళ్ళ దాకా ఖాళీ కాగా, మిగిలిన అద్దె ఇళ్ళు కూడా ఖాళీబాట పడుతుండడంతో ఇళ్ళ యజమానులు నిరాశలో పడిపోతున్నారు. అటు పనులు లేక, జీతాలు రాక, చేతిలో డబ్బులు లేక కుటుంబాలు పోషించుకునే పరిస్థితి లేక నగరానికి వలసవచ్చిన వారంతా వెళ్ళిపోతుండడంతో నగరం చాలా పలసనగా కనిపిస్తోంది.

ఈ మాయదారి కరోనా రాకాసి పోతే తప్ప ఈ దుస్థితి మారదని, కరోనా వల్ల తమ బతుకులు తలకిందులైపోతున్నాయని పేద, మధ్యతరగతి వలసజీవులు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు.

# చెప్పిన మాట నిలబెట్టుకున్న యువనేత



- మహిళల జీవితాలకు బాసటగా.. 'వైయస్సార్ చేయూత'
- రాష్ట్రంలో 23 లక్షలమంది ఖాతాల్లో రూ. 17,850 వంతున జమ
- మహిళా లబ్ధిదారులకు మొత్తంగా నాలుగేళ్ళలో 75వేల సాయం

*సాధారణంగా నాయకులు ఎన్నికలప్పుడు చెప్పిన మాటలను ఆ తర్వాత గాలికి వదిలేస్తుంటారు. ఎన్నిక కాగానే ప్రజల ఊసు పట్టించుకోకుండా తమ స్వార్థం తాము చూసుకుంటూ ఉంటారు. ఇది ప్రజలందరికీ అనుభవైకవేద్యమే. కానీ చెప్పిన మాట నిలబెట్టుకునే వారు ఏ కొద్దిమందో ఉంటారు. అలాంటి అరుదైన నేతల్లో యువనేత జగన్మోహన్‌రెడ్డి ఒకరు. జగన్ తన పాదయాత్ర సందర్భంగా ఎందరో అక్కచెల్లెమ్మల బాధలను కళ్ళారా చూశారు. చెవులారా విన్నారు. వారి బాధలు తీర్చేందుకు ఒక అన్నగా, ఒక తమ్ముడిగా తానున్నానంటూ.. నేనంతా విన్నాను.. నేనున్నాను అధైర్యపడకండి అని భరోసా ఇస్తూ.. అప్పుడు చెప్పిన మాటలను ఇప్పుడు అక్షరాలా నిలబెట్టుకుంటూ తన ప్రత్యేకతను రుజువు చేసుకుంటున్నాడు. ఈ నేపథ్యంలో తాజాగా వచ్చిన బృహత్తర పథకమే.. 'వైయస్సార్ చేయూత'!...*

రాష్ట్రంలోని దాదాపు 23 లక్షల మంది మహిళలకు సాయంగా 18,750 రూపాయల వంతున వారి బ్యాంకు ఖాతాలో నేరుగా జమచేశారు రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి. మహిళలకు ఆర్థికంగా చేయూతనిచ్చే ఈ అపురూపమైన పథకం నెల 12వ తేదిన ముఖ్యమంత్రి తన చేతులమీదుగా ప్రారంభించి అక్కచెల్లెమ్మలకు తాను గతంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో 45 నుంచి 60 ఏళ్ళ మధ్య వయసున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు 22,28,909 మందికి.. ఏటా 18,750 రూపాయల వంతున నాలుగేళ్ళలో మొత్తం 75వేల రూపాయల ఆర్థిక సాయం అందుతుంది. అంతేకాదు మహిళల జీవనోపాధికి కూడా బాటలు వేస్తూ వారికి ప్రభుత్వం తనవంతు సహకారం అందించనుంది. వ్యాపార రంగంలో రాణించేలా మహిళలకు తోడ్పాటునందిస్తూ పెద్ద కంపెనీలైన అమూల్, రిలయన్స్, ఐటిసి తదితర సంస్థలతో ఒప్పందం కుదుర్చుకుంది. ప్రభుత్వం సూచించిన జీవనోపాధి మార్గాలకు ఈ డబ్బును వినియోగిస్తే అందుకు సంబంధించిన మార్కెటింగ్, సాంకేతికపరమైన సహకారంతో పాటు అదనపు బ్యాంకు రుణాలు అందించేందుకు కూడా ప్రభుత్వం సహకరిస్తుంది. ఇప్పుడు వైయస్సార్ చేయూత పథకం ద్వారా అందిస్తున్న ఈ సాయాన్ని బ్యాంకులు ఇతరత్రా రుణాల కింద జమచేసుకోకుండా ఏర్పాటు చేసింది కూడా. ఈ సాయంపై ఎలాంటి ఆంక్షలు లేకపోవడం, ఈ డబ్బును దేనికి వాడుకోవాలన్నది పూర్తిగా మహిళల ఇష్టానికే వదిలేసింది. ఈ పథకం కింద ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారు గ్రామ సచివాలయానికి వెళ్ళి దరఖాస్తు చేసుకుంటే వారు పరిశీలించి అర్హులకు వచ్చే నెలలో కూడా ఈ పథకాన్ని వర్తింపజేసేందుకు ఏర్పాట్లు చేయడం ఎంతో సంతోషదాయకం.

ప్రభుత్వానికి ప్రస్తుత పరిస్థితుల్లో ఎన్నో ఆర్థిక ఇబ్బందులున్నా, ఎంతోకాలం నుంచి అష్టకష్టాల్లో ఉన్న మహిళలకు ఎంత కష్టమైనా సరే చేయూతనివ్వాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి ఈ నిర్ణయం తీసుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ఇప్పటికే 60 ఏళ్ళ వయసు దాటిన వారికి ప్రతి నెలా పేద అక్కచెల్లెమ్మలకు 2,250 రూపాయల వంతున సామాజిక పింఛన్లను అందజేసి వారికి సాయపడుతోంది. దానికి అదనంగా వైయస్సార్ చేయూత పథకం కింద ప్రతి ఏటా ఆర్థికసాయం అందిస్తుండడం వల్ల మహిళల జీవనోపాధికి తగు ఆర్థిక చేయూతనందించినట్లవుతుంది. తద్వారా మహిళా సాధికారతను కూడా సాకారం చేసుకున్నట్లవుతుంది. అందుకే గతంలో ఏ ప్రభుత్వాలు చేపట్టని విధంగా మహిళాభ్యున్నతిని కాంక్షిస్తూ, పేదరికాన్ని దూరం చేస్తూ.. ఇంతమంచి పథకాన్ని అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌కు మహిళా లోకం కృతజ్ఞతలు చెప్తూ హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తోంది.




## జిల్లాకు 249.46 కోట్లు విడుదల :

జిల్లాలో కూడా ఈ పథకం కింద 1,33,047 మంది లబ్ధిదారులకు 18,750 రూపాయల వంతున ఆర్థికసాయం అందించనున్నారు. అందుకు 249.46 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నమూనా చెక్కును ఈనెల 12న రాష్ట్ర పరిశ్రమల మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు కలసి నెల్లూరులోని జడ్పీ సమావేశమందిరంలో విడుదల చేశారు. మహిళలు వారి కాళ్ళమీద వాళ్ళు నిలబడి జీవనం సాగించేందుకు ఈ పథకం ఎంతగానో తోడ్పడుతుందని, ఈ డబ్బును లబ్ధిదారులైన మహిళల బ్యాంకు ఖాతాల్లో జమచేశామని చెప్పారు. ఈ డబ్బుతో పాటు బ్యాంకులు కూడా మహిళలకు మరో 82వేల రూపాయలు రుణాలిచ్చేవిధంగా చర్యలు తీసుకున్నామన్నారు. ప్రభుత్వం, బ్యాంకులు ఇచ్చే ఈ ఆర్థికసదుపాయం సుమారు లక్షకు పైగా అవుతుందని, ఈ నిధితో మహిళలు ఆర్థికంగా ఎదుగుతూ మంచి ఆర్థికాభ్యున్నతి సాధించాలని వారు ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## నెల్లూరు కబుర్లు

మంత్రి అనిల్‌పై..

# విమర్శలు దారుణం

## కావాలంటే బహిరంగ చర్చకు సిద్ధం

**- వైకాపా నేత రూప్‌కుమార్‌యాదవ్**



నెల్లూరు అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న మంత్రి అనిల్ కుమార్‌పై లేనిపోని విమర్శలు చేయడం దారుణమని, కౌన్సిలర్ స్థాయికే ఎక్కువైన ఒక వ్యక్తి మంత్రిపై విమర్శలు చేయడం సిగ్గుచేటని వైయస్సార్‌సీపి యువజన విభాగం అధ్యక్షుడు రూప్‌కుమార్‌యాదవ్ అన్నాడు.. ఈనెల 16న నెల్లూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నెల్లూరు ప్రజలను కొన్నేళ్ళుగా మోసం చేస్తున్న ఆ వ్యక్తి గతంలో నుడా ఛైర్మెన్‌గా కూడా ఉన్నారంటూ టిడిపి నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి విమర్శలను పరోక్షంగా ప్రస్తావించాడు. కమిషనర్ బాపిరెడ్డి, కలెక్టర్, జేసీల బదిలీల విషయంలో మంత్రిపై ఆ వ్యక్తి అనేక ఆరోపణలు చేస్తున్నాడని, అధికారుల బదిలీల విషయం ప్రభుత్వ నిబంధనల మేరకే ఉంటుందనే విషయం కూడా తెలియని ఆ వ్యక్తి మంత్రిపై ఆరోపణలు చేయడం ఏమిటని ప్రశ్నించాడు. అవాకులు చెవాకులు పేలకుండా వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలన్నాడు. గత ప్రభుత్వం మంచి అధికారులను ఏ విధంగా ఇబ్బంది పెట్టిందనే విషయం ప్రజలందరికీ బాగా తెలుసన్నాడు. ఆ వ్యక్తి చేసిన ఆరోపణలను నిరూపించగలుగుతాడా.. ఒక్క ఆరోపణనైనా రుజువు చేయగలడా అని ఆయన అంటూ అన్ని రాజకీయపార్టీలు, మీడియా సమక్షంలో ఏ ప్రాంతంలోనైనా ఈ విషయాలపై బహిరంగ చర్చకు తాను సిద్ధమని రూప్‌కుమార్ సవాల్ విసిరాడు.

విశ్వసాయిలో ...

# స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు



నెల్లూరులోని విశ్వసాయి జూనియర్ కళాశాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈనెల 15న స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మెన్ డా.ఎన్ సత్యనారాయణ, ఛైర్‌పర్సన్ రుక్మిణి, వైస్‌ఛైర్మెన్ జి. కృష్ణమోహన్‌లు మాట్లాడుతూ ఎంతోమంది స్వాతంత్ర్య యోధుల త్యాగాలతో నేడు మనం స్వేచ్ఛను అనుభవిస్తున్నామని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని దేశాభ్యున్నతికి పాటుపడాలని చెప్పారు. ఈ వేడుకల్లో విద్యార్థులు, కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

## విఎస్‌యులో...



నెల్లూరులోని విక్రమసింహపురి విశ్వవిద్యాలయంలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఆగస్టు 15న ఘనంగా జరిగాయి. విఎస్‌యు వి.సి ఆర్ సుదర్శనరావు జెండా వందనం చేసి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. విఎస్‌యు రెక్టార్ రామచంద్రయ్య, రిజిస్ట్రార్ ఎల్‌వి కృష్ణారెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా విఎస్‌యు తరపున స్వచ్ఛంధంగా జాతీయ సేవా పథకం వాలంటీర్లు 'హెల్ప్ ది నీడీ' పేరుతో బృందంగా ఏర్పడి కరోనా వ్యాధి పట్ల ప్రజలకు అవగాహన కోసం చేపట్టిన కార్యక్రమాలను ప్రశంసిస్తూ ఆ బృందం నాయకుడైన బయోటెక్నాలజీ అధ్యాపకుడు డాక్టర్ ఉదయశంకర్‌ను, బృందం సభ్యులను అభినందించి ప్రశంసాపత్రాలు అందజేశారు.

అదనపు బాధ్యతలు తీసుకున్న

# జేసీ ప్రభాకర్‌రెడ్డి



జిల్లా జాయింట్ కలెక్టర్(అభివృద్ధి)గా ఉన్న డా.ఎన్ ప్రభాకర్‌రెడ్డి ఈనెల 16న రెవెన్యూకు సంబంధించిన అదనపు బాధ్యతలు స్వీకరించారు. మొన్నటిదాకా జేసీగా ఉన్న డా. వినోద్‌కుమార్ (రెవెన్యూ) బదిలీ కావడంతో ఆ బాధ్యతలు కూడా జేసీ ప్రభాకర్‌రెడ్డికి ప్రభుత్వం అప్పగించింది. అనంతరం ఆయన నెల్లూరులోని తన ఛాంబర్‌లో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. ఇటీవలే పదోన్నతులు పొందిన విఆర్‌ఓలకు రెవెన్యూశాఖ చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగించాలని, అవసరమైతే వారికి శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటుచేయాలని చెప్పారు. ఇళ్ళపట్టాల పంపిణీకి సంబంధించిన పూర్తి వివరాలను నివేదికల ద్వారా అందజేయాలన్నారు. కరోనా నిర్ధారణ పరీక్షలు జరుగుతున్న తీరును సమీక్షించారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ మల్లికార్జున, నెల్లూరు ఆర్డీఓ హుస్సేన్‌సాహెబ్, కలెక్టరేట్ ఏ.ఓ రామారావు తదితరులు పాల్గొన్నారు.

కరోనా బాధితులకు

# ప్లాస్మా దానం చేయండి

**- రెడ్‌క్రాస్ ఛైర్మెన్ పిలుపు**

కరోనాను జయించి వచ్చిన తండ్రీకొడుకులు కరోనాతో బాధపడుతున్న వారిని ఆదుకునేందుకు ప్లాస్మా దానం చేసి మానవత్వం చాటుకుంటూ అందరి అభినందనలు అందుకున్నారు. నెల్లూరులో ఈ సంఘటన ఈనెల 16న జరిగింది. కరోనా వ్యాధి నుంచి కోలుకున్నవారి ప్లాస్మాతో ఇద్దరు కరోనా రోగులను ప్రాణాపాయం నుంచి కాపాడవచ్చని ఈ సందర్భంగా ప్లాస్మా దానం చేసిన తండ్రీకొడుకులు చలువాది కృష్ణప్రసాద్, చలువాది షణ్ముఖసాయి చెప్పారు. నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌లో వారు ప్లాస్మా దానం చేశారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మెన్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కోవిడ్ వైరస్‌ను జయించిన వారు విషమపరిస్థితుల్లో ఉన్న కరోనా బాధితులకు ప్లాస్మా దానం చేసి వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చాడు. నెల్లూరులోని నారాయణ, సింహపురి ఆసుపత్రుల్లో కరోనాతో చికిత్సపొందుతున్న బాధితులకు ప్లాస్మా అవసరం ఉందని ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంగా చలువాది కృష్ణ ప్రసాద్, చలువాది షణ్ముఖసాయి, గోపాల్, బలరామ్, కైలాష్‌కుమార్, శ్యామ్ ఓ-పాజిటివ్ ప్లాస్మాను బ్లడ్‌బ్యాంక్‌లో దానం చేశారు. రెడ్‌క్రాస్ కమిటీ సభ్యులు బయ్యా ప్రసాద్, మక్కెన అంకయ్యచౌదరి, ఎడవల్లి, సురేష్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ యశోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు దుప్పట్లు, ఆహారపొట్లాలు పంపిణీ



నెల్లూరులోని ప్రముఖ పారిశ్రామికవేత్త కొండా బలరామిరెడ్డి 87వ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈనెల 16న నగరంలోని స్వతంత్రపార్కులో పేదలకు దుప్పట్లు, ఆహారపొట్లాలు అందజేశారు. కేతా అంకులు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏపియుడబ్ల్యుజె నాయకుడు జయప్రకాష్ మాట్లాడుతూ కరోనా నేపథ్యంలో ఎందరో పేద, మధ్యతరగతి ప్రజలు ఉపాధి కోల్పోయి, పనులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అలాంటి వారిని ఆదుకోవడం అందరి బాధ్యతన్నాడు. కరోనా కష్టకాలంలో పేదలకు తనవంతు సహాయసహకారాలందజేస్తున్న కొండా బలరామిరెడ్డి సేవాభావాన్ని అందరూ కొనియాడారు. కేతా సుబ్బారావు, కృష్ణమూర్తి, అనూరాధ, న్యాయవాది రమాదేవి పాల్గొన్నారు.

# వాజ్‌పేయికి బిజెపి నాయకుల నివాళి

మాజీప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి మహానేత అని, నేటి తరానికి ఆయన స్ఫూర్తిదాయకమని బిజెపి జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ అన్నాడు. వాజ్‌పేయి రెండవ వర్ధంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని బిజెపి జిల్లా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ వాజ్‌పేయి దేశానికి చేసిన అమూల్యమైన సేవలను గుర్తుచేసుకుని ఆయనకు ఘననివాళులర్పించారు. బిజెపి జిల్లా మాజీ అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, రాష్ట్ర అధికారప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి, రాధాకృష్ణ, రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసుల సేవలు..

# పోలీసుశాఖకే గర్వకారణం

**- రాష్ట్ర హోంమంత్రి సుచరిత ప్రశంస**

రాష్ట్రంలో ప్రతి పేదవాడి సొంత ఇంటి కల సాకారం చేసేందుకు ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఎంతో కృషిచేస్తున్నారని, దేశంలోనే వైయస్ జగన్ బెస్ట్ సిఎంగా మూడవస్థానంలో నిలవడం రాష్ట్రానికే గర్వకారణమని రాష్ట్ర హోంమంత్రి మేకతోటి సుచరిత ప్రశంసించారు. స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న అనంతరం నెల్లూరులోని ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ నేర నియంత్రణలోనూ, ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించడంలోనూ జిల్లా పోలీసు యంత్రాంగం పనితీరు అభినందనీయమని దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా జిల్లా పోలీసుశాఖకు ఎంతో ప్రతిష్టాత్మకమైన ఐఎస్‌ఓ సర్టిఫికెట్ రావడం పోలీసుశాఖకే గర్వకారణమని జిల్లా ఎస్పీని, పోలీసు అధికారులను అభినందించారు.

# దళితులపై దాడులను అరికట్టండి

దళితులపై దాడులను అరికట్టాలని కోరుతూ జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ ఈనెల 16న రాష్ట్ర హోంశాఖ మంత్రి సుచరితకు విజ్ఞప్తిచేశాడు. జిల్లాలో దళితులపై దాడులు ఎక్కువవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశాడు.

రక్తదానం చేసిన

# చిరంజీవి అభిమానులు

మెగాస్టార్ చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈనెల 16న నెల్లూరులోని చిరంజీవి అభిమానులు రక్తదానం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. నగరంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొట్టే వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, వంశీ, వేణు, సాయి, కిషోర్, విష్ణు, రెడ్‌క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్చకులకు

# బియ్యం వితరణ

నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలోని అర్చకులకు ఈనెల 17న శ్రావణసోమవారం పుణ్యదినాన్ని పురస్కరించుకుని స్థానిక కార్‌జోన్ నిర్వాహకుడు శంతన్‌కృష్ణ, మనోజ్ కుమార్‌లు కలసి ఆ అర్చకులకు పాతిక కేజీల బియ్యం వంతున అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు తంగిరాల రాధాకృష్ణశర్మ, రాధయ్య స్వామి తదితరులు పాల్గొన్నారు.

# ఆదర్శప్రాయుడు సర్దార్ గౌతు లచ్చన్న



స్వాతంత్ర్యసమర యోధుడు, మాజీ మంత్రి స్వర్గీయ గౌతు లచ్చన్న జీవితం ఆదర్శప్రాయమని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కనకట్ల రఘురామ్ ముదిరాజ్ కొనియాడాడు. నెల్లూరులోని ఆ సంస్థ కార్యాలయంలో ఈనెల 16న గౌతు లచ్చన్న జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం లభించడం గౌతు లచ్చన్న పోరాటఫలితమేనన్నారు. ఆయన సేవలకు గుర్తుగా జిల్లా కేంద్రంలో గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉదయగిరి నరసింహులుగౌడ్, నాయకులు దద్దోలు రమణయ్యగౌడ్, తిరువీధి నారాయణరావు, పి.శ్రీనివాసులు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# పంద్రాగస్టు వేడుకలు

జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచనల మేరకు జిల్లా కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు కొండా అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో ఈనెల15న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నగరంలోని ఇందిరా భవన్‌లో జరిగిన ఈ వేడుకల్లో డిసిసి ఉపాధ్యక్షుడు బాలసుధాకర్ పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. స్వాతంత్ర్య సమర వీరులను స్మరించుకున్నారు. జిల్లా యువజన కాంగ్రెస్ నాయకుడు పి.గణేష్‌బాబు, నగర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఎస్‌కె ప్యాయజ్, నాయకులు అరవ రామ్మోహన్‌రావు, షబ్బీర్, నక్కా శీనయ్య, వేణు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

• ఘనంగా 74వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

# వాడవాడలా మువ్వన్నెల జెండా రెపరెపలు



భారతదేశం స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు సాధించుకున్న అపూర్వమైన రోజైన ఆగస్టు 15న జిల్లావ్యాప్తంగా వాడవాడల్లో మువ్వన్నెల జెండా రెపరెపలాడింది. 74వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని సర్వత్రా ప్రజలు స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు జరుపుకున్నారు. అయితే, ఈసారి కరోనా ప్రభావంతో నిరాడంబరంగానే ఈ వేడుకలు జరిగాయి. కరోనా నియంత్రణ సూచనలతో అందరూ సామాజిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరించి వేడుకలు జరుపుకున్నారు. జిల్లా కేంద్రమైన నెల్లూరులో పోలీసు పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన ఈ వేడుకల్లో రాష్ట్ర హోంశాఖమంత్రి సుచరిత పాల్గొని జెండాకు వందనం చేసి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. నాటి స్వాతంత్ర్యయోధుల పోరాట పటిమను అందరూ ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని, వారి త్యాగాలు చిరస్మరణీయమని వక్తలు స్వాతంత్ర్యవీరులను కొనియాడారు. అదేవిధంగా కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు, జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి జి.వెంకటకృష్ణయ్య, జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ భాస్కర్‌భూషణ్ ఇలా అన్నిచోట్ల అధికారులు జాతీయపతాకావిష్కరణలు చేసి త్యాగధనులైన స్వాతంత్ర్యసమరవీరుల దేశభక్తిని అందరికీ వివరించారు. ప్రజాప్రతినిధులు, నాయకులు అందరూ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆయా పార్టీల కార్యాలయాల ప్రాంగణాల్లో మువ్వన్నెల జెండా ఎగురవేసి జెండా వందనం గావించారు. పంద్రాగస్టును ప్రజలంతా ఒక పండుగలా నిర్వహించారు.

## 'నవరత్నాల'తో సంక్షేమ ఫలాలు

**- హోంశాఖ మంత్రి సుచరిత**

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్ర సమగ్రాభివృద్ధికోసం నిరంతర కృషి జరుగుతోందని, నవరత్నాల పథకాలతో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం పాటుపడుతోందని రాష్ట్ర హోంశాఖ మంత్రి సుచరిత అన్నారు. ఆగస్టు 15న నెల్లూరులోని పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో జరిగిన 74వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలు ప్రజల ముంగిళ్ళలోకే చేరేందుకు దేశంలోనే కనీవినీ ఎరుగని విధంగా ముఖ్యమంత్రి గ్రామ, వార్డు సచివాలయాలను ఏర్పాటు చేసి సంక్షేమఫలాలను నేరుగా ప్రజలకే అందజేస్తున్నారని కొనియాడారు.

జిల్లాలో వ్యవసాయం పరిస్థితి ఎంతో బావుందని, వరుణుడు తమ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తున్నాడని అంటూ ఖరీఫ్ సీజన్‌లో గతంలో 55వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉండగా, ఇప్పుడది లక్షా2వేల హెక్టార్లకు పెరిగిందని, రైతులకు చేదోడుగా రైతుల ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులకు 783.54 కోట్ల రూపాయలను నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమచేసిందన్నారు. వైయస్సార్ రైతు భరోసా పథకం కింద ప్రతి కుటుంబానికి పెట్టుబడి సాయంగా 13,500 రూపాయల వంతున ఇప్పటికి రెండుసార్లు జిల్లాలో 4 లక్షలమంది రైతులకు 54వేలకోట్లకుపైగానే అందించడం జరిగిందన్నారు. జగనన్న విద్యాకానుకలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి దాకా చదువుకుంటున్న 2 లక్షలమందికి పైగా విద్యార్థులకు నోట్‌పుస్తకాలు తదితర 7రకాల సామగ్రిని ప్రభుత్వం అందజేస్తోందని అన్నారు.

### కోవిడ్ నివారణకు కట్టుదిట్టమైన చర్యలు

కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు ప్రభుత్వం, జిల్లా అధికారయంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని, కోవిడ్ నివారణకు లక్షలాదిగా మాస్కులు పంపిణీ చేయడం, కోవిడ్ పరీక్షలు చేయించడం, బాధితులకు సత్వర చికిత్సలు చేయించడం వంటివన్నీ జరుగుతోందని, కరోనా నివారణకు 24గంటలూ వైద్యులు, పారిశుధ్య సిబ్బంది, పోలీసు యంత్రాంగం, జిల్లా అధికార యంత్రాగం ఇలా అందరూ ముందువరుసలో ఉండి కృషి చేస్తున్నారని ప్రశంసించారు. జిల్లాలో ఏడు సంజీవని బస్సుల ద్వారా కరోనా పరీక్షలు చేయిస్తున్నారని, సుమారు 2లక్షల మందికిపైగానే పరీక్షలు జరిగాయని చెప్పారు. జిల్లాలో ఇప్పటిదాకా 16,688 కరోనా కేసులు నమోదయ్యాయని, 10,760 మంది వైద్యచికిత్సలతో కోలుకుని డిశ్చార్జి అయ్యారని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రజలకు చేరవేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా వారందరికీ ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు, ఎస్పీ భాస్కర్‌భూషణ్, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, జేసీలు, ప్రభుత్వశాఖల ఉన్నతాధికారులు అందరూ పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న ప్రభుత్వ శకటాలు :

ఈ సందర్భంగా విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, వ్యవసాయ అను బంధశాఖలు, అగ్నిమాపక, డిఆర్‌డిఏ తదితర శకటాల ప్రదర్శన ఆకట్టుకుంది. కరోనా నేపథ్యంలో చిన్నారులు ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలను రద్దుచేశారు. అతిథులు, ఉన్నతాధికారులు సామాజిక దూరం పాటిస్తూ ఈ వేడుకల్లో పాల్గొన్నారు.

---

కరోనా కష్టాలు

## ఎంత నేసినా.. అతుకుల బతుకులే!

### - నిరుపేద నేతన్నల విలవిల!



**అసలే ఆర్థికంగా ఎంతో పేదస్థితిలో ఉన్న జిల్లాలోని అనేకమంది చేనేతకారుల పరిస్థితి ఈ కరోనా దెబ్బతో మరింత హృదయ విదారకంగా తయారవుతోంది. ఎంతో నైపుణ్యంతో నేత నేసినా చివరికి కూటికి గతిలేని దుర్భరస్థితి వారిని వెంటాడుతూనే ఉంది.**

కరోనా, లాక్‌డౌన్‌ల ప్రభావంతో విదేశాల నుంచి రావాల్సిన ముడిసరుకులు నిలిచిపోవడం మరోవైపు నేసిన వస్త్రాలు ఎగుమతికి నోచుకోక, ఆశించిన స్థాయిలో స్థానికంగా కొనే దుకాణాదారులు లేకపోవడం, దూరప్రాంతాల్లో అమ్ముకునేందుకు రవాణా సౌకర్యాలు లేకపోవడం తదితర కారణాలతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో చేనేతరంగం సంక్షోభంలో పడింది. అందుబాటులో ఉన్న ముడిసరుకులు తెచ్చుకుందామంటే వాటి ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నేతకారులు ఆర్థికంగా కష్టాల్లో ఉండడంతో చేనేత పరిశ్రమ అయోమయావస్థలో కొట్టుమిట్టాడుతోంది. దీంతో నేతకారులకు అంతో ఇంతో కూలి ఇచ్చి వస్త్రాలు నేయించుకునే యజమానులు నేతవస్త్రాలకు డిమాండ్ లేదంటూ నేతకారులకు స్వల్పమైన మొత్తాలనే ఇస్తుండడంతో పేద చేనేతకారులు, వారి కుటుంబాల వారు పడే బాధలు వర్ణనాతీతంగా ఉంటున్నాయి.

జిల్లాలో సుమారు 8వేలకు పైగానే చేనేత కుటుంబాలున్నాయి. వీరి కుటుంబాలతో కలసి వారి సంఖ్య సుమారు పాతికవేలకు పైగానే ఉంటుంది. ఒక్క వెంకటగిరి ప్రాంతంలోనే 1850 దాకా మగ్గాలున్నాయి. ఇక్కడి నేతన్నలంతా అత్యధికశాతం మంది పేదలే. ముఖ్యంగా జిల్లాలోని వెంకటగిరి, కోవూరు మండలంలోని కోవూరు, పాటూరు, మండల కేంద్రాలైన సంగం, చెన్నూరు, నెల్లూరు రూరల్ మండలంలోని నారాయణరెడ్డిపేట, సౌత్ మోపూరు, ములుముడి తదితర ప్రాంతాలు చేనేతకు ప్రసిద్ధి. ఈ ప్రాంతాల్లోని నేతన్నలు నిత్యం నేతపనిలోనే ఉంటారు. అదే వారికి జీవనోపాధి. అయితే ఎంతగా కష్టించి పనిచేస్తున్నా తమ కుటుంబాలను పోషించుకోలేక వారు అవస్తలు పడుతూనే ఉండడం బాధాకరం. కొంతకాలం క్రితం దాకా సాదారకాల వస్త్రాలు నేసి ఇచ్చినందుకు 2వేల రూపాయలకు పైగానే ఇచ్చేవారు. ఇప్పుడు ఈ కరోనా పరిస్థితుల్లో కేవలం 1500 మాత్రమే ఇచ్చి సరిపెట్టేస్తున్నారు. అదేవిధంగా మంచి రకాల వస్త్రాలు నేసినందుకు 2500 దాకా ఇచ్చేవారు 2వేలే ఇచ్చి సరిపెట్టుకోమంటున్నారు. ఆ వస్త్రాలు నేయాలంటే ఒక్కపూటలోనే ఒక్కరోజులోనే అయ్యేపని కూడా కాదు. నేత నేయడం ఎంతో ఓపికతో చేయాల్సిన పని. అది ఎంతో కష్టమే కాక, ఎంతో శ్రమ, నైపుణ్యంతో కూడుకుని ఉంటాయి. పట్టువస్త్రాలు నేసేవాళ్ళకి కూడా భారీగానే కూలిరేట్లలో కోతపెడుతున్నారు. విధిలేని పరిస్థితుల్లో తగ్గించి ఇచ్చే ధరలకే పేద చేనేతకారులు ఒప్పుకుని వస్త్రాలు నేసి ఇస్తున్నారు. ఈ పరిస్థితుల్లో ఆయా కుటుంబాల వారికే ఉపాధి లేక ఇబ్బందులు పడుతుంటే, ఇంతకాలం వారికి వారి నేతపనుల్లో సాయంగా వచ్చే నిరుపేద కూలీలకు డబ్బులివ్వలేక అన్ని పనులు తామే చేసుకుంటూ ఎలాగోలా కాలం వెళ్ళబుచ్చుతున్నారు. దీంతో ఆ నిరుపేద కూలీల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. ఇలా ఉపాధి కోల్పోయిన ఇలాంటి వారి సంఖ్య వేలల్లోనే ఉంటోంది.

### ప్రభుత్వం సాయం చేస్తున్నా..

### కూలి రేట్లు గిట్టుబాటు కావడం లేదు :

ఈ కరోనా కష్టకాలంలో నేతన్నలకు సాయంగా ఇటీవల ప్రభుత్వం అర్హులైన లబ్దిదారులకు 24వేల వంతున ఆర్థికసాయం చేయడం నేతన్నల కుటుంబాలకు ఎంతో ఊరట కలిగించింది. జిల్లాలోనే కాక రాష్ట్రవ్యాప్తంగా వైయస్సార్ నేతన్న నేస్తం కార్యక్రమం కింద ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి గతంలో ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటూ నేతన్నలకు ప్రభుత్వం నుంచి తగు ఆర్థికసాయం చేస్తూనే ఉన్నారు. ఇటీవలే గత జూన్ నెలలో రాష్ట్రంలోని 80వేల చేనేత కుటుంబాల వారికి నేరుగా వారి బ్యాంక్ అకౌంట్లలో డబ్బు జమ అయ్యేలా చేశారు కూడా. దీంతో ప్రభుత్వం పుణ్యమా అంటూ ఎంతోమంది చేనేతకారులు తమ మగ్గాలను కూడా బాగుచేసుకుని ఆధునికం చేసుకుంటున్నారు. కానీ..నిత్యం తాము పడుతున్న కష్టానికి యజమానులిచ్చే కూలిరేట్లు మాత్రం గిట్టుబాటు కావడం లేదని, దీంతో తమ పరిస్థితి మళ్ళీ మొదటికే వస్తోందని లబ్దిదారులైన నేతకారుల వేదన. పగలు పొద్దస్తమానం కష్టపడి నేత నేసి వస్త్రాలను ఎంతో కళాత్మకంగా తయారుచేసి యజమానులకు ఇస్తున్నా వారు ముడిసరుకులు లభించడం లేదని, నేసిన వస్త్రాలను ఎగుమతి చేసే పరిస్థితి లేదని అంటూ తమకు కూలిధరలు అమాంతం తగ్గిస్తుండడం వల్ల మళ్ళీ తమకు బాధలు తప్పడం లేదని వారు వాపోతున్నారు. ప్రభుత్వం తమ అవస్తలు గమనించి చేనేత వస్త్రాలకు డిమాండ్ వచ్చేలా, మార్కెట్‌లో వాటి విక్రయాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని, ముడిసరుకుల ధరలు వీలైనంత తక్కువకే లభించేలా తగు చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

---

## వినాయకచవితిని ఇళ్ళలోనే జరుపుకోవాలి

నెల్లూరు నగరంలో రోజురోజుకు కరోనా వ్యాధి విజృంభిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వ నియమ నిబంధనలను అందరూ పాటించాలని, గణేశుని విగ్రహాలను రోడ్లపై ప్రతిష్ఠించి వేడుకలు నిర్వహిస్తే కఠినచర్యలు తప్పవని నెల్లూరు వేదాయపాళెం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ టివి సుబ్బారావు హెచ్చరించారు. ఈనెల 17న ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈసారి వినాయకచవితి పర్వదినాన్ని ఇళ్ళలోనే నిర్వహించుకోవాలని, కరోనా నేపథ్యంలో ఎవరూ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించకూడదని స్పష్టం చేశారు. ఎక్కడా గుంపులుగా తిరగకూడదని, స్వీయనియంత్రణ పాటిస్తూ కరోనా వ్యాధిని కట్టడి చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు.

## వింజమూరులో సంపూర్ణ లాక్‌డౌన్

మండల కేంద్రమైన వింజమూరులో కరోనా విస్తరిస్తున్న నేపథ్యంలో లాక్‌డౌన్ విధించారు. ఈనెల 17న తహశీల్దార్ కార్యాలయంలో అధికారులు అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి కోవిడ్ వైరస్ కట్టడికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. ఆగస్టు నెలాఖరు దాకా సంపూర్ణ లాక్‌డౌన్ విధించాలని నిర్ణయించారు. మండలంలో ఇప్పటికే 192 కోవిడ్ పాజిటివ్ కేసులు నమోదయ్యాయని, అయిదుగురు మరణించారని, 47 మంది కరోనా నుంచి కోలుకుని ఇళ్ళకు వెళ్లారని, మిగిలినవారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారని, కరోనా నియంత్రణకు ప్రజలందరూ ముందుజాగ్రత్తలు తీసుకోవాలని, లాక్‌డౌన్‌కు వ్యాపారులు సహకరించాలని వారు కోరారు.

# మహనీయుల త్యాగాలతోనే దేశానికి స్వాతంత్ర్యం

గూడూరులో స్వాతంత్ర్యదినోత్సవ సంబరాలు ఘనంగా జరిగాయి. సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణంలో సబ్‌కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు పాల్గొని జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాలతో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించిందని, వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమపథకాలు అందిస్తున్నారన్నారు. కరోనా నియంత్రణకు ప్రభుత్వం అన్నివిధాలా చర్యలు తీసుకుంటున్నదని అన్నారు. ఈ సందర్భంగా గూడూరు ప్రాంతంలో సమాజానికి విశేష సేవలందించిన పలువురికి, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ వేడుకల్లో మునిసిపల్ కమిషనర్ ఓబులేశు, డిప్యూటి డిఎం అండ్‌హెచ్ఓ అచ్యుతకుమారి, తహశీల్దార్ బాలలీలారాణి, గూడూరు సిఐ దశరథ రామారావు, రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐలు బ్రహ్మనాయుడు, పుల్లారావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. అదేవిధంగా గూడూరులోని తహశీల్దార్ కార్యాలయం, పురపాలక సంఘ కార్యాలయం, సబ్‌డివిజన్ పోలీసు అధికారి కార్యాలయాల్లో కూడా ఆయా అధికారుల ఆధ్వర్యంలో ఆగస్టు 15న జాతీయపతాకాన్ని ఎగురవేసి జెండా వందనం చేశారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు



## కలెక్టర్‌ను కలిసిన ఆనం విజయ

జిల్లా కేంద్ర సహకారబ్యాంక్ ఛైర్మన్ ఆనం విజయకుమార్‌రెడ్డి మంగళవారం జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబును నగరంలోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం జిల్లా కేంద్రసహకార బ్యాంక్ రైతులకు అందిస్తున్న సేవలను ఆయన కలెక్టర్‌కు వివరించారు.

## గూడూరు డివిజన్ వార్తలు

## ఇళ్ళలోనే పండుగలు చేసుకోవాలి

**- సబ్ కలెక్టర్ గోపాలకృష్ణ**



కరోనా వ్యాధి ఉధృతి కొనసాగుతున్న నేపథ్యంలో ప్రజలు ఇళ్లలోనే ఉండి పండుగలు నిర్వహించుకోవాలని, కరోనా దరిచేరకుండా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ చెప్పారు. ఈనెల16న ఆయన విలేకరులతో మాట్లాడుతూ కరోనా నిబంధనలు పాటిస్తూ రానున్న వినాయకచవితి, దసరా పండుగలు, మొహర్రం పర్వదినాలను ప్రజలు ఇళ్లలోనే నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కోవిడ్ నిబంధనలను అనుసరించి ప్రభుత్వం చెప్పిన ప్రకారం నడుచుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## కోవిడ్ నియంత్రణకు కట్టుదిట్టంగా చర్యలు

**- కమిషనర్ ఓబులేశు**



గూడూరు మునిసిపాలిటీ పరిధిలో కరోనా నియంత్రణకు కట్టుదిట్టంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని మునిసిపల్ కమిషనర్ ఓబులేశు అన్నారు. ఈనెల 16న ఆయన విలేకరులతో మాట్లాడుతూ గూడూరు పట్టణంలో ఇప్పటిదాకా 550 మంది కరోనా బారిన పడ్డారని, అందులో 370 మంది కోలుకున్నారని చెప్పారు. పరిసరాలను పరిశుభ్రం చేసుకుంటూ ఉండాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని, ప్రజలందరూ కోవిడ్ నిబంధనలు తప్పకుండా పాటించాలని కోరారు. స్వీయనియంత్రణతో, సామాజిక దూరం పాటిస్తూ, మాస్కులు ధరిస్తూ తగు ముందు జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని జయించవచ్చన్నారు.

## వీధి వ్యాపారులకు రుణాలివ్వండి

**- అధికారులకు కలెక్టర్ ఆదేశం**

రోడ్డుమార్జిన్‌లలో చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని జీవనోపాధి పొందుతున్న వీధి వ్యాపారుల జీవనప్రమాణాలను మెరుగుదల చేసేందుకు అధికారులు కృషిచేయాలని, వారికి గుర్తింపు కార్డులు, అవసరమైన రుణాలు ఇచ్చేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 18న ఆయన కేంద్ర గృహ, పట్టణాభివృద్ధిశాఖల మంత్రి హర్దీప్‌సింగ్‌పూరి ఢిల్లీ నుంచి ప్రధానమంత్రి స్ట్రీట్ వెండర్స్ ఆత్మనిర్భర్ నిధి పథకం అమలుపై జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ పిఎం స్వా నిధి పథకం ద్వారా రోడ్డుమార్జిన్ వ్యాపారులకు 10వేల రూపాయలు వడ్డీరాయితీతో రుణాలు మంజూరు చేయాలని తెలిపారు. అనంతరం ఈ పథకంపై కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశమై నెల్లూరు కార్పొరేషన్, మునిసిపాలిటీల్లో రోడ్డు మార్జిన్ వ్యాపారులకు గుర్తింపుకార్డులు అందజేసే కార్యక్రమాన్ని సత్వరం పక్కాగా చేపట్టాలని మెప్మా పీడీ రవీంద్రబాబును ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా 13,784 మంది రోడ్డుమార్జిన్ వ్యాపారులు ఉన్నట్లు గుర్తించామని ఈ సందర్భంగా అధికారులు కలెక్టర్‌కు చెప్పారు. కార్పొరేషన్ ఇన్‌చార్జి కమిషనర్ పార్థసారథి, ఎల్‌డిఎం రాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపండి :**

జిల్లాలో వన్ ధన్ వికాస్‌యోజన పథకాన్ని విజయవంతంగా అమలుచేసి గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపాలని జిల్లా కలెక్టర్ చక్రధర్‌బాబు అధికారులకు సూచించారు. ఈనెల18న ఆయన నెల్లూరులో జేసీ ప్రభాకర్‌రెడ్డితో కలసి ఐటిడిఏ, వ్యవసాయ అధికారులతో సమావేశమై జిల్లాలో ఈ పథకం అమలుతీరును సమీక్షించారు. గిరిజనుల జీవనప్రమాణాలను పెంచేందుకు అధికారులు సమన్వయంతో కృషిచేయాలన్నారు. ఇన్‌చార్జి జేసీ (ఆసరా) శీనానాయక్, డిఎఫ్ఓ షణ్ముఖ కుమార్, ఐటిడిఏ పి.ఓ ఆనందమణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కరోనా విజేతకు ఘనస్వాగతం

గూడూరు పట్టణంలోని 1వ పట్టణ పోలీస్‌స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా కానిస్టేబుల్ కరోనా నుంచి కోలుకుని విధుల్లోకి రావడంతో పట్టణ సిఐ దశరథ రామారావు ఆధ్వర్యంలో ఈ నెల 17న ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ సరైన జాగ్రత్తలు పాటిస్తూ తగు ముందుజాగ్రత్తలు తీసుకుంటే కరోనాని జయించవచ్చున్నారు. కానిస్టేబుల్ ఆత్మస్థైర్యంతో కరోనా నుంచి కోలుకోవడం సంతోషకరమన్నారు. కరోనా నేపథ్యంలో విధులు నిర్వహించడం కష్టమైనా పోలీసు సిబ్బంది విధినిర్వహణలో ఉంటూ ప్రజలకు సేవలందించడం అభినందనీయమన్నారు. రూరల్ సిఐ రామకృష్ణారెడ్డి, ఎస్ఐ బ్రహ్మయ్యనాయుడు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


కరోనాను జయించి వచ్చిన మహిళా కానిస్టేబుల్‌ను అభినందిస్తున్న సిఐ దశరథరామారావు


74వ స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15న గూడూరు సబ్‌కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు, కమిషనర్ ఓబులేసుల చేతులమీదుగా, తన ఉత్తమ సేవలకు గుర్తింపుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న శ్రీకృష్ణ సేవాసమితి అధ్యక్షుడు మయూరి శ్యాంయాదవ్, బెస్ట్ మెడికల్ ఆఫీసర్‌గా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న డా. కె.వి.నిత్యప్రశాంతి.

## రైతులకు 9గంటల పాటు విద్యుత్

**ఏపి ఎస్‌పిడిసిఎల్ ఛైర్మెన్ హరనాధరావు**



రైతులకు పగటిపూట 9 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపి ఎస్‌పిడిసిఎల్ ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ హరనాధరావు తెలిపారు. గూడూరు మండల పరిధిలోని గోగినేని పురం గ్రామంలోని విద్యుత్ కార్యాలయంలో అధికారులతో ఆయన ఇటీవల సమావేశం నిర్వహించి, డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో ఏర్పడుతున్న సమస్యలను, విద్యుత్ సరఫరాలో జరుగుతున్న నష్టాలను తగ్గించేందుకు తీసుకున్న చర్యలపై, బకాయిల వసూళ్ళపై ఆయన చర్చించారు. గత వారం నుండి ప్రయోగాత్మకంగా రైతులకు పగటిపూట విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని, ఈ క్రమంలో తలెత్తుతున్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని హరనాధరావు తెలిపాడు. సమావేశంలో సూపరెంటెంట్ ఇంజనీర్ విజయ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సోమశేఖర్, రమణదేవి పాల్గొన్నారు.

## శ్రీసిటీలో స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు

శ్రీసిటీలో ఈనెల 15న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇక్కడి బిజినెస్ సెంటర్ ప్రాంగణంలో శ్రీసిటీ డైరెక్టర్ పి. ముకుందరెడ్డి జాతీయపతాకాన్ని ఆవిష్కరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన సందేశంలో శ్రీసిటీ సిబ్బందికి 74వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కోవిడ్ వైరస్ సంక్షోభాన్ని సమర్థవంతంగా ఎదుర్కొన్న శ్రీసిటీ కమ్యూనిటీ సమిష్టికృషిని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. జిల్లా పాలనాయంత్రాంగం, పోలీసుల సహకారంతో కోవిడ్ నిబంధనల మేరకు సామాజిక దూరం, భద్రతా ప్రమాణాలు పాటిస్తూ శ్రీసిటీలోని అన్ని పరిశ్రమలు ఉత్పత్తులను తిరిగి ప్రారంభించినందుకు సంతోషంగా ఉందన్నారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) సి. రమేష్‌కుమార్, శ్రీసిటీ ఇన్‌చార్జి సెక్యూరిటీ చీఫ్ రమేష్ తదితరులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు.



# పాడి రైతులకు ప్రభుత్వం అండ

పాడి రైతుల సంక్షేమానికి వైయస్ జగన్మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, ఒక్క సర్వేపల్లి నియోజకవర్గంలోనే సుమారు కోటి రూపాయలతో పశువుల ఆసుపత్రులకు భవనాలు నిర్మించారని, రైతు బాగుంటనే దేశం బాగుంటుందనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి జగన్ పాడిరైతులకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి చెప్పారు. ఈనెల 17న ఆయన తోటపల్లిగూడూరులో 32 లక్షలతో నిర్మించిన వెటర్నరీ డిస్పెన్సరీ నూతన భవనాన్ని ప్రారంభించి మాట్లాడుతూ పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాడిరైతుల కోసం పశుక్రాంతి పథకాన్ని అమలుచేశాడన్నారు. ప్రకృతి విపత్తులతో పశువులు మృతిచెందితే రైతులు నష్టపోకుండా పశు నష్ట నివారణ పథకాన్ని కూడా తమ ప్రభుత్వం చేపట్టిందని, నిజాయితీగా ప్రజల కోసం పనిచేస్తున్న సిఎంకు ప్రకృతి కూడా అండగా నిలుస్తూ సకాలంలో వర్షాలు కురుస్తూ రైతులు సుభిక్షంగా ఉంటున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్సీపి రాష్ట్ర కార్యదర్శి చిల్లకూరు సుధీర్‌రెడ్డి, తోటపల్లిగూడూరు సొసైటీ అధ్యక్షుడు ఇసనాక రమేష్‌రెడ్డి, ఎంపిడిఓ హేమలత, పార్టీనాయకులు పాల్గొన్నారు.

# జిల్లాకు చేరిన 'జగనన్న విద్యా కానుక'

ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అమలుచేయనున్న 'జగనన్న విద్యా కానుక' జిల్లాకు చేరిందని, త్వరలోనే ఈ కానుకను విద్యార్థులకు అందజేస్తామని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు అధికారి బ్రహ్మానందరెడ్డి ఈనెల 17న ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమం కింద విద్యార్థులకు నోట్‌పుస్తకాలు, స్కూల్ బ్యాగు, బూట్లు, సాక్సులు, మూడుజతల యూనిఫాం క్లాత్ తదితర ఆరు రకాల వస్తువులు జిల్లాకు చేరాయని, వీటిని మండలాలకు తరలిస్తున్నామని, త్వరలోనే ఇవి విద్యార్థులందరికీ చేరుతాయని ఆయన తెలిపారు.

# జొన్నవాడ కామాక్షమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని జొన్నవాడలో వెలసివున్న మల్లికార్జున సమేత శ్రీ కామాక్షిదేవి అమ్మవారి ఆలయంలో ఈనెల 18న అమ్మవారికి ఎంతో భక్తిశ్రద్ధలతో కుంకుమార్చన నిర్వహించారు. తొలుత అమ్మవారిని శోభాయమానంగా అలంకరించి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి లలితా సహస్రనామార్చన చేశారు. కరోనా కారణంగా అతితక్కువ మంది భక్తులు భౌతికదూరం పాటిస్తూ ఈ పూజల్లో పాల్గొన్నారు. ఆలయ పాలకమండలి ఛైర్మెన్ చీమల రమేష్‌బాబు, కార్యనిర్వహణాధికారి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## కరోనా మృతులపై..

# భూమన 'కరుణ'

- మృతులకు ఆయనే ఆత్మబంధువు
- మృతదేహాలకు దగ్గరుండి అంత్యక్రియలు



***అమ్మో! కరోనా!.. అంటూ ఆ మాట వింటేనే సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు. ఇక కరోనాతో చనిపోయినవాళ్ళని చూడా లంటే ఇంకా భయపడిపోతున్నారు. ఆ మాయదారి వ్యాధి తమకు కూడా ఎక్కడ అంటుకుంటుందోనని అందరికీ భయం. అయితే, కరోనాని ధైర్యంగా ఎదుర్కోవాలి కానీ.. ఇలా భయపడుతూ కూర్చుంటే ఎలా?.. కరోనా పట్ల అపోహలతో అలా మానవత్వం లేకుండా వ్యవహరించడం ఎంతమాత్రం మంచిది కాదంటూ కరోనా మృతుల పట్ల ఎంతో కరుణ చూపుతూ.. వారి మృతదేహాల అంత్యక్రియలను తానే దగ్గరుండి జరిపిస్తూ తన మానవీయతను చాటుకుంటున్నాడు.. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి.***

ఎంతోమంది సాహసికులు కూడా చేయలేని పని ఆయన చేస్తుండడం అందరి అభినందనలకు పాత్రమవుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కరోనా అంటే భయపడిపోయి, అయినవారు చని పోయినా వారి మృతదేహాలను చూడడానికి గానీ, అంత్యక్రియలు చేయడానికిగానీ వెనుకాడుతున్న నేటి రోజుల్లో తనే వారికి ఆత్మ బంధువుగా మారి.. కరోనా మృతదేహాల అంత్యక్రియలు నిర్వ హిస్తూ అనితరసాధ్యమైన సేవలందిస్తున్నాడాయన. అంతేకాదు, కరోనా అపోహలపై సమరనాదం మోగిస్తూ నేటి సమాజంలో అందరికీ ఆదర్శంగా ఉంటూ అందరి అభినందనలు అందుకుం టున్నాడు. ఎమ్మెల్యేగా ఉంటూ.. ఇలా ప్రజల కష్టాల్లో అనునిత్యం పాలుపంచుకుంటూ ప్రజాప్రతినిధి అంటే ఎలా ఉండాలో కూడా నిరూపిస్తున్నాడు.

కరోనాతో మృతిచెందిన వారి మృతదేహాలను తమ దగ్గరికే రానివ్వకుండా అనేక ప్రాంతాల్లో వారి కుటుంబసభ్యులు, బంధువులే దూరంగా ఉంటున్న దౌర్భాగ్య కాలం ఇది. కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు చేయడానికి ఎవరూ సాహసించకపోతున్న నేటి పరిస్థితుల్లో కరోనా వ్యాధి పట్ల అంత భయం అవసరం లేదని, ప్రభుత్వాలు చెప్తున్న ముందు జాగ్రత్తలతో ధైర్యంగానే కరోనాని ఎదుర్కోవాలని తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి అంటు న్నాడు. కరోనా మృతదేహాలకు అంత్యక్రియలు జరపడమన్నది మానవత్వానికి నిదర్శనమంటూ ఆ సాహసానికి తానే ముందుంటూ అందరి భయాన్నీ పోగొడుతున్నాడు. వ్యాధి లక్షణాలున్నా వైద్య పరీక్షలు చేయించుకోకపోవడం, కోవిడ్ వైరస్ నివారణకు ప్రభుత్వాలు చెప్తున్న నియమనిబంధనలు పాటించకపోవడం వల్ల ఈ వ్యాధి విస్తరిస్తూ ఉందని, కనుక ప్రజలు కరోనా అంటేనే భయపడకుండా తగు పరీక్షలు సకాలంలో చేయించుకుని ఈ వ్యాధి బారినుంచి బయటపడాలని ఆయన సూచిస్తున్నాడు.

తిరుపతిలో ఇటీవల మానవ వికాసవేదిక ఆధ్వర్యంలో హరిశ్చంద్ర శ్మశానవాటికలో జరిగిన కార్యక్రమంలో కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ కూడబెట్టుకున్న కోట్లకు అధిపతి అయినా భిక్షగాడైనా ఎప్పటికైనా శ్మశానానికి రావాల్సిందేనని, కూడబెట్టుకున్న నోట్లు, కోట్లు ఏవీ మనవెంట రావని, మనం చేసిన మంచిపనులు మాత్రమే చిరస్థాయిగా నిలిచిపోతాయని హితవు పలికాడు. కరోనా రోగుల పట్ల మానవత్వం ప్రదర్శించి సమిష్టిగా అందరం కలసి కరోనా వ్యాధిని జయించాలని చెప్పాడు. అదేవిధంగా, కరుణాకర్‌రెడ్డితోపాటు చిత్తూరుజిల్లాలోని మరో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి కూడా కరోనా వ్యాధిగ్రస్తుల పట్ల కరుణతో వ్యవహరిస్తూ రోగులను స్వయంగా పలకరిస్తూ, ఎవరైనా కరోనాతో చనిపోతే వారి అంత్యక్రియల్లో పాల్గొంటూ కరోనా పట్ల ఉన్న అపోహలను తొలగిస్తున్నారు. కరోనా పట్ల ఉన్న అపోహలపై సమరశంఖం మోగిస్తూ..బాధితులకు అన్నివిధాలా అండగా ఉంటున్న వైకాపా నాయకుల ధైర్యసాహసాలను అందరూ మెచ్చుకుంటున్నారు.

## శ్రీరాముడు పూజలు చేసిన పవిత్ర క్షేత్రం..

# రామతీర్థంలోని.. శ్రీరామలింగేశ్వరాలయం



***నెల్లూరుజిల్లాలో ఎంతో మహిమాన్వితమైన.. పురాతనమైన పుణ్యక్షేత్రాల్లో రామతీర్థంలోని రామలింగేశ్వరాలయం ఒకటి. విడవలూరు మండలం రామతీర్థం గ్రామంలో వెలసివున్న ఈ ఆలయం త్రేతాయుగం నాటిదని, శ్రీరామచంద్రుడు ఇక్కడ సాగరతీరాన శివలింగాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడని, అందువల్ల ఈ క్షేత్రం శ్రీరామలింగేశ్వరాలయంగా ప్రసిద్ధి చెందిందని ప్రఖ్యాతి.***

**మన దేవాలయాలు (9)**

ప్రశాంతమైన పల్లె వాతావరణంలో, సాగరతీరంలో.. ఇసుక తిన్నెలపై వెలసి వున్న పుణ్యక్షేత్రం.. రామతీర్థంలోని కామాక్షీదేవి సమేత శ్రీరామలింగేశ్వ రాలయం. ప్రాచీన శిల్పకళా వైభవంతో తొణికిసలాడే ఈ ఆలయం ఎంతో కాలంగా భక్తాదులను ఆకట్టుకుంటూనే ఉంది. ఈ దేవాలయానికి త్రేతాయుగం నాటి పురాణకథనంతో పాటు, ఆ కాలం నాటి ఆసక్తికరమైన చరిత్ర కూడా ఉంది.

**ఆలయ చరిత్ర :**

త్రేతాయుగంలో.. రావణాసురుడు సీతను అపహరించుకునిపోగా, సీతా న్వేషణ చేస్తూ శ్రీరాముడు ఇక్కడి సాగర తీరం మీదుగా లంక వైపుకు వెళ్తూ, తన నిత్య శివార్చనలో భాగంగా ఇక్కడి సైకత తీరంలో స్వహస్తాలతో శివలిం గాన్ని ప్రతిష్ఠించి పూజలు చేశాడని, అందువల్ల శ్రీరాముడు ప్రతిష్ఠించిన పరమేశ్వరలింగం శ్రీరామలింగేశ్వర ఆలయంగా ఈ క్షేత్రం వినుతికెక్కిం దని, ఈ ప్రాంతానికి 'రామతీర్థం' అనే పేరు వచ్చిందని పురాణ కథనం. ఈ ప్రాంతంలోని సాగరతీరం ఎంతో పుణ్యప్రదమైనదని, సప్తరుషులు కూడా ఇక్కడ స్నానమాచరించి శ్రీరామలింగేశ్వరు నికి పూజలు చేసేవారని అంటుంటారు. ఆ తర్వాత కాలక్రమేణా ఇక్కడ చాళుక్య రాజుల పాలనలో ఆలయం నిర్మించారు. ఎంతో విశిష్టమైన ఈ ఆలయ నిర్మాణం బహు అరుదైనదని చెప్పవచ్చు. పల్లవ రాజుల కాలంలో కూడా ఈ ఆలయం మరింతగా అభివృద్ధి చెందింది. ఆ తర్వాత కాలంలో శ్రీకృష్ణదేవరాయలు కూడా ఇక్కడికి వచ్చి శ్రీరామలింగేశ్వరుని దర్శించుకుని పూజలుచేసినట్లు చరిత్ర పేర్కొంటోంది. కాలక్రమంలో 19వ శతాబ్దినాటికి ఆలయం శిథిలావస్తకు చేరుకోగా, ఇక్కడికి సమీపంలోని ఊటు కూరు ప్రాంతానికి చెందిన కోటంరెడ్డి శేషాద్రిరెడ్డి అనే భక్తుడికి శ్రీరామలింగేశ్వ రుడు స్వప్నదర్శనమిచ్చి ఆలయాన్ని బాగు చేయాలని ఆదేశించాడని, దాంతో ఈ ఆలయ నిర్మాణాన్ని జీర్ణోద్ధరణగావించారని అంటారు. ఈ ఆలయం శిథిలావస్థలో ఉన్నప్పుడు ఒక ఆవు రోజూ వచ్చి ఇక్కడ పుట్టలో ఉన్న శివలింగంపై పాలు చిందిం చడం చూసిన పాలేరు ఆ ఆవును కొట్ట డంతో ఆ దెబ్బలు శివలింగానికి కూడా తగిలి మూడు ముక్కలు కావడంతో ఈ విషయం తెలిసిన గ్రామస్తులు శివలింగం విడిపోకుండా చుట్టూ వెండికట్టు కట్టారనే గాథ కూడా ప్రచారంలో ఉంది. ఆ వెండి కట్టు నేటికీ ఉండడం విశేషం.

**అపూర్వమైన ఆలయం :**

ఈ ఆలయం ఎంతో అపూర్వమైన నిర్మాణ కౌశలంతో ఉంది. సాధారణంగా శివలింగాలు నలుపు, తెలుపు రంగుల్లో ఉంటుంటాయి. కానీ, ఇక్కడి శివలింగం తెలుపు, ఆకుపచ్చ రంగులు కలిసి ఎంతో మనోహరంగా ఉంటుంది. ఆలయంలో కొలువైవున్న నందీశ్వరుడు లేపాక్షి బసవన్న తర్వాత అంతటి పెద్దదిగా ప్రసిద్ధి చెందింది. జీవ కళ ఉట్టిపడుతూ నందీశ్వరుని విగ్రహం నాటి రాజుల పాలనల్లోని శిల్పకళా వైభ వాన్ని చాటిచెప్తూ ఉంటుంది. ఎప్పుడో వందలాది సంవత్సరాల క్రితం సాగరంలో కొట్టుకువచ్చిన ఒక గంట కూడా ఆల యంలో ఇప్పటికీ ఉంది. పూర్వకాలంలో ఈ గంటను మోగిస్తే ఓం అనే నాదం వినిపించేదట కూడా. ఆలయ ప్రాంగ ణంలో కాలక్రమేణా నవగ్రహ మం డపం, చండికేశ్వరాలయం, వినాయకుని మందిరం వెలిశాయి.

**అందరికీ ఆరాధ్యదైవం :**

రామతీర్థం రామలింగేశ్వరుడు లక్షలాదిమంది భక్తులకు ఆరాధ్యదైవం. ప్రతిఏటా జేష్టమాసం బహుళపక్ష సప్తమి నుంచి అమావాస్య వరకు ఇక్కడ అత్యంత వైభవంగా బ్రహ్మోత్సవాలు జరుగుతుంటాయి. ఆలయానికి రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న సముద్ర తీరంలో భక్తులు స్నానమాచరించి వచ్చి స్వామి అమ్మవార్లను దర్శించుకుని తరిస్తుంటారు.

ప్రత్యేకించి కామాక్షిదేవి-శ్రీరామ లింగేశ్వరస్వామి వార్ల కల్యాణోత్సవం సమయంలో ఇక్కడ వివాహాలు చేసు కోవడం వల్ల ఆయా దంపతుల జీవి తాలకు ఎలాంటి కష్టాలుండవని ఇక్కడి పెద్దలు చెప్తుంటారు.

వీక్షణం - మంజీర

# జై జై గణేశా!

'గణేశ చతుర్థి వేడుకలను ఇళ్లలోనే జరుపుకోండి. జనం సమూహాలుగా గుమిగూడి సామాజిక వేడుకగా నిర్వహించుకునే పరిస్థితులు ఈ ఏడాది లేవు. కాబట్టి కోవిడ్ మహమ్మారి ఉగ్రరూపాన్ని అర్థం చేసుకుని వినాయక చవితి వేడుకలను ఇళ్లలోనే చేసుకోండి' అని ప్రభుత్వాలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి.

నిజమే... పిల్లల దేవుడు గణేశుడు ఈ ఏడాది పూజగదికే పరిమితం కావాలి. పత్రి కోసం ఊరంతా వెతికి తోటలు, పొలాల్లో శోధించి సాధించినప్పుడు గొప్ప పరిశోధన పత్రాన్ని సమర్పించినంతగా సంతోష పడుతుంది బాల్యం. పిల్లల ఆనందం ఇంత అని కొలవడానికి ఏ కొలమానాలూ ఉండవు. ఈ తరం బాల్యానికి పత్రి శోధన పెద్దగా పరిచయం ఉండదు. కానీ కాలనీల్లో వెలిసే పెద్ద వినాయకుడి మండపంలో పాటలు, డ్యాన్సులు, ఫ్యాన్సీ డ్రెస్ పోటీలతో పదిరోజుల పాటు కోలాహలంగా సాగే గణేశ ఉత్సవాల కోసం మాత్రం తప్పకుండా ఎదురు చూస్తారు. పెద్దవాళ్లు లేని సమయం చూసి వినాయకుడి తొండాన్ని, చెవులను, బొజ్జను తాకి చూసేవరకు పిల్లల మనసు ఊరుకోదు. ఈ ఏడాది ఈ ముచ్చట్లేవీ ఉండవు. 21వ శతాబ్దం నుంచి వినాయకుడు ఒక్కసారిగా పదిహేడవ శతాబ్దంలోకి మారిపోయాడు. సామూహిక ఉత్సవాలు లేని రోజుల్లో ఇంటిపట్టున పూజలందుకున్న జ్ఞాపకాల్లోకి జారిపోతున్నాడు.

## తిలక్ దిద్దిన తిలకం

వినాయక చవితి పూజలను ఊరి జనమంతా సామూహికంగా నిర్వహించుకోవడం అనే ప్రయోగానికి 19వ శతాబ్దంలో తిలకం దిద్దినవాడు బాల గంగాధర్ తిలక్. అవి బ్రిటిష్ పాలన నుంచి దేశాన్ని విముక్తం చేయడానికి జాతీయోద్యమం ఊపందుకుంటున్న రోజులు. అప్పటికే సిపాయిల తిరుగుబాటు జరిగింది. 1857లో సిపాయిలు తిరుగుబాటు చేయడంతో బ్రిటిష్ పాలకులు ఉద్యమ నాయకుల మీద నిఘా పెంచారు. రాజకీయ సమావేశాలు, సామాజిక కలయికలను కూడా నిషేధించారు. గ్రామాల్లో కూడా ప్రజలు తరచుగా పదిమంది ఒకచోట కలిస్తే వారిని కట్టడి చేసేవాళ్లు. పైగా జాతీయోద్యమంలో పాల్గొంటున్న దేశభక్తి పరాయణులు కూడా ఎవరికి వారుగా ఆందోళన కార్యక్రమాల్లో పాల్గొనేవాళ్లు. అందరూ కలిసి ఒక త్రాటి మీద ఉద్యమించడానికి ప్రయత్నాలు లేవప్పట్లో. మనదేశంలో వేళ్లూనుకుని పోయి ఉన్న కుల విభజన ప్రభావం జాతీయోద్యమం మీద కూడా పడుతోందని గ్రహించాడు తిలక్. దాంతో కులాలు లేవు, మతాలు లేవు... ఉన్నదంతా భారతీయతే అని చాటడానికి గణేశ ఉత్సవాలను సాధనంగా మలుచుకున్నాడు. దేవుడు అందరివాడు, అందరూ కలిసి వేడుక నిర్వహించుకోవాలనే సందేశం ఇచ్చాడు. విడి విడిగా ఉన్న జనాన్ని కలివిడిగా మార్చేశాడు తిలక్. 1893లో భారీ గణేశ విగ్రహాన్ని పూనా నగరంలో ప్రతిష్ఠించి పూజలు నిర్వహించాడు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు పశ్చిమం నుంచి తూర్పు వరకు గణేశుడు వెలిశాడు. అందరూ వినాయకుడి ముందు మోకరిల్లారు. భారతీయులుగా తామంతా ఒక్కటేననే భావం సంకేత పూర్వకంగా ప్రకటితమైంది. అలా సామూహిక వేడుకలు చేసుకున్న వినాయకుడు స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత కూడా ఏటా భాద్రపద మాసం చవితి రోజున ఊరూరా వెలుస్తూనే ఉన్నాడు. వాడవాడలా విస్తరించాడు.

### ఆద్యుడు శివాజీ

మొఘలుల పాలన కాలంలో మహారాష్ట్రలో హిందూ రాజ్యాన్ని స్థాపించిన వాడు ఛత్రపతి శివాజీ. ఆయన పాలన కాలంలో మొఘలుల పాలకుడు మొదటి బహదూర్ షా. షాజహాన్ తర్వాత వచ్చిన మొఘల్ పాలకుల కాలంలో హిందువుల అణచివేత తీవ్రమైంది. అప్పుడు ఛత్రపతి శివాజీ తన రాజ్యంలో అందరినీ మతాతీతంగా ఏకం చేయడానికి సామూహిక గణేశ ఉత్సవాలకు శ్రీకారం చుట్టాడు. అయితే శివాజీ కాలంలో సామూహిక వేడుకలు మహారాష్ట్ర వరకే పరిమితమయ్యాయి. మరికొంత ప్రాచీనంగా చూస్తే క్రీస్తుపూర్వం 271 నుంచి క్రీస్తుశకం 1190 మధ్యకాలంలో శాతవాహనులు, రాష్ట్రకూటులు, చాళుక్యులు కూడా వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అప్పట్లో సామాజిక నేపథ్యం కంటే సాంస్కృతిక నేపథ్యమే ప్రధానంగా ఉండేది. శివాజీ కాలం నుంచి గణేశ పూజ సామాజిక చైతన్యానికి నాంది అయింది.

మహారాష్ట్రలో వినాయకుడి విగ్రహాల తయారీలో హిందువులు, ముస్లింలు, క్రిస్టియన్‌లు అందరూ ఉపాధి పొందుతున్నారు. వేడుకల్లో పాల్గొని ప్రసాదాలందుకుంటున్నారు. హిందువులు మాత్రం వినాయకుడిని కులాల వారీగా వేరు చేస్తున్నారు.

ముంబయి మహానగరంలో అయితే పదివేల విగ్రహాలు వెలుస్తాయి. ఓ 30ఏళ్ల కిందటి వరకు తెలుగు రాష్ట్రాల్లో పెద్ద హడావుడి ఉండేది కాదు. హైదరాబాద్ వరకే పరిమితం. మెల్లగా నగరాలు, పట్టణాలు, గ్రామాలు కూడా 'గణపతి బప్పా మోరియా' అనడం మొదలు పెట్టాయి. పట్టణంలో వీధికి ఈ చివర ఒకటి ఆ చివర ఒకటి, గ్రామాల్లో ఒక్కో కులం వాళ్లు ఒక్కో విగ్రహాన్ని ప్రతిష్ఠించుకోవడం మొదలు పెట్టారు. ఏ కుల విభజనకు వ్యతిరేకంగా గణేశుడు అందరినీ ఒక దారిలోకి తెచ్చాడో... అదే వినాయకుడి సాక్షిగా భారతీయ సమాజం మళ్లీ కుల ప్రాతిపదికన చీలిపోవడం మొదలు పెట్టింది. రాజకీయ రంగ ప్రవేశానికీ, కుల రాజకీయాలకూ గణేశుడినే సాధనంగా మార్చుకోవడం మనవాళ్ల తెలివితేటలకు పరాకాష్ఠ. సమాజం ఇంతగా వ్యాపారమయం అయిపోతే భగవంతుడు చూస్తూ ఊరుకోడు. ఏదో ఒకటి చేస్తాడు. ఇప్పటికైతే వినాయకుడు కాలనీలు వదిలేసి ఇంట్లో ఐసోలేషన్ పాటిస్తున్నాడు. తనకు తానుగా దూరం పాటిస్తున్నాడు.

ఏటా రెండు తెలుగు రాష్ట్రాల దృష్టిని ఆకర్షించే ఖైరతాబాద్ వినాయకుడు... 65 ఏళ్లుగా ఏడాదికి ఒక్కో అడుగు పెరుగుతూ 66 అడుగులకు చేరిన వినాయకుడు... ఈ ఏడాది 27 అడుగులకు సర్దుకున్నాడు. దేవ వైద్యుడు ధన్వంతరి రూపంలో దర్శనమిస్తూ కరోనా భయం వద్దని అభయం ఇస్తున్నాడు. భౌతికదూరం తప్పదని, ఆన్‌లైన్ పూజలో పాల్గొనమంటున్నాడు.

# సీఎం సహాయనిధి నుంచి 10 లక్షలు సాయం



నెల్లూరు ఎంపి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సిఫార్సు మేరకు సిఎం సహాయనిధి నుంచి అయిదుగురు బాధితులకు 10 లక్షల రూపాయల దాకా సాయం అందింది. ఆ చెక్కులను ఈనెల 18న విజయా డెయిరీ ఛైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి బాధితులకు పంపిణీ చేశాడు. కరోనా కష్ట కాలంలోనూ సిఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమని ఆయన అన్నాడు. ఈ సందర్భంగా సీఎం జగన్మోహన్‌రెడ్డికి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డికి అందరూ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బట్టేపాటి నరేంద్రరెడ్డి, స్వర్ణ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# నీటి ప్రాజెక్టులకు వంద కోట్లు వచ్చాయి

**- సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య వెల్లడి**



సూళ్ళూరుపేట నియోజకవర్గంలో పలు నీటిపారుదల ప్రాజెక్టుల నిర్మాణాలకు ప్రభుత్వం వంద కోట్ల రూపాయలను మంజూరు చేసిందని, సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తిచేసి రైతుల వ్యవసాయానికి సాగునీళ్లందించాలని ముఖ్యమంత్రి వైయస్ జగన్ నిరంతర కృషిచేస్తున్నారని సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య చెప్పాడు. ఈనెల 17న ఆయన తడ మండలం పరిధిలోని కరిపేటి కాలువ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులను పరిశీలించాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో సాగునీరు, తాగునీటి సమస్యలను శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు కృషిచేస్తున్నామన్నాడు. గత టిడిపి ప్రభుత్వంలోని పాలకుల అనాలోచిత నిర్ణయాలతో కాదలూరు చెరువులో సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్ నిర్మించడం, అది నిరుపయోగంగా మారడం జరిగాయని, దానిని వినియోగంలోకి తెచ్చి పాములకాలువ నుంచి నీటిని తెప్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట చెంగాళమ్మ దేవాలయం పాలకమండలి ఛైర్మెన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, వైయస్సార్సీపి నాయకులు కళత్తూరు రామ్మోహన్‌రెడ్డి, మారంరెడ్డి వెంకటకృష్ణారెడ్డి, గండవరం సురేష్‌రెడ్డి, కె. రఘు, కళత్తూరు శేఖర్‌రెడ్డి, దబ్బల శ్రీమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కరోనా వైద్యం పేరుతో..

# ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల దోపిడీని అరికట్టాలి

**- ప్రజారోగ్య వేదిక వినతి**

కరోనా వైద్యం పేరుతో కార్పొరేట్ ఆసుపత్రులు బాధితులను నిలువుదోపిడీ చేస్తున్నాయని, ఈ దారుణాన్ని వెంటనే అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రజారోగ్య వేదిక అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎంవి రమణయ్య, కామేశ్వరరావు ఈనెల 17న ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్రప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రాలకంటే ఎక్కువ సంఖ్యలో కరోనా పరీక్షలు చేస్తూ కోవిడ్ వైరస్‌ను కట్టడి చేసేందుకు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని వారు ప్రశంసించారు. అందరికీ వైద్యం అందాలనే ఉద్దేశంతో ఫీజులు నిర్దేశిస్తూ జి.ఓలు 77, 78 విడుదల చేసినా ప్రైవేటు ఆసుపత్రులు, కార్పొరేట్ ఆసుపత్రులు ఆ నిబంధనలను తుంగలో తొక్కుతూ రోగుల నుంచి అత్యధికంగా డబ్బులు వసూలుచేస్తుండడం దారుణమన్నారు. కొన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ, ఇన్సురెన్స్‌లను కూడా అంగీకరించడం లేదని, మరికొన్నిచోట్ల అంగీకరించినా బాధితులకు ఆక్సిజన్ పెట్టేందుకు ఐసియులో ఉంచాలని చెప్తూ బాధితులను దోపిడీ చేస్తున్నారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ దారుణాన్ని ప్రభుత్వం ఇకనైనా అరికట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. ఆసుపత్రుల్లో పడకలు, సేవల వివరాలు ఆయా ఆసుపత్రుల బయట నోటీసు బోర్డులో ఎప్పటికప్పుడు ప్రకటిస్తుండాలని వారు ఈ సందర్భంగా అధికారులను కోరారు.




# పెద్దాసుపత్రిలో మరో 300 పడకలు

కరోనా బాధితుల కోసం నెల్లూరు పెద్దాసుపత్రిలో మరో 300 పడకలు సిద్ధం చేయనున్నట్లు ఆసుపత్రి కోవిడ్ నోడల్ అధికారి, జేసీ (ఆసరా) శీనానాయక్ చెప్పాడు. ఈనెల 18న ఆయన పెద్దాసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు చేసి బాధితులకు అందుతున్న సేవలను పరిశీలించాడు. సిసి కెమెరాల పనితీరును పర్యవేక్షించాడు. రోగులకు ఆసుపత్రిలో మెరుగైన సౌకర్యాలు అందిస్తున్నారా లేదా అని ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తున్నామన్నాడు.



బాబు ఎన్ని అడ్డంకులు సృష్టించినా..

# పేదలకు ఇళ్లస్థలాలిచ్చి తీరుతాం

- ఎమ్మెల్యే ప్రసన్న



ప్రతిపక్ష నాయకుడు చంద్ర బాబునాయుడు ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ ప్రభుత్వం పేదలకు ఇళ్ళస్థలాలిచ్చి తీరుతుందని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి ధీమాగా చెప్పారు. కొడవలూరు మండలంలోని కమ్మపాళెం నుంచి గుర్రాలదిన్నె దాకా 2.75 లక్షలతో ఏర్పాటుచేసిన విద్యుత్‌లైన్‌ను ఆయన ఈనెల 19న ప్రారంభించాడు. ఈ సందర్భంగా ప్రసన్న విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఆర్థికపరిస్థితి బాగాలేకున్నా ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలందరి అభిమానం పొందుతున్నాడన్నాడు. కోవూరు నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు 300 కోట్లు అందజేశారని, ప్రతి పేదవానికీ ఇల్లుండాలనే సత్సంకల్పంతో నియోజకవర్గంలో 12,052 మందికి 352ఎకరాల భూమిని నివేశనస్థలంగా కేటాయించారని చెప్పాడు. ఇంతపెద్దఎత్తున ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం కృషిచేస్తుంటే చంద్రబాబు ఓర్వలేక ఆ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నాడని ఆరోపించాడు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నాసా వెంకటేశ్వర్లు నాయుడు, కిశోర్, నాపా ప్రసాద్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్మా ద్వారా..

# 70 మంది ప్రాణాలను కాపాడాం

- కలెక్టర్ చక్రధర్‌బాబు



ప్లాస్మా ద్వారా 70 మంది కరోనా బాధితుల ప్రాణాలను కాపాడగలిగామని జిల్లా కలెక్టర్ కెవిఎన్ చక్రధర్‌బాబు చెప్పాడు. ఈనెల 19న ఆయన ముత్తుకూరు మండలంలోని పాటూరువారి కండ్రిగలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కట్టుదిట్టమైన చర్యలతో కోవిడ్ మరణాల సంఖ్యను తగ్గించేందుకు పెద్దఎత్తున కృషి జరుగుతోందని, ప్రజలు ఈ విషయం గమనించి అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రుల్లో చేరడం కంటే కోవిడ్ లక్షణాలున్నప్పుడే చేరితే సత్వర వైద్యచికిత్సలు అందించి ప్రాణాలు నిలబెట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఆసుపత్రుల్లో 2500 పడకలు, కోవిడ్‌కేర్ సెంటర్లలో మరో 3500 పడకలతో పాటు వెంటిలేటర్ల సంఖ్యను కూడా పెంచి బాధితులను కోవిడ్ నుంచి రక్షించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ మాస్కు ధరించి కోవిడ్ నివారణకు తీసుకోవాల్సిన అన్ని జాగ్రత్తలను పాటించాలని విజ్ఞప్తి చేశారు.

### నాడు-నేడులో జిల్లా ఫస్ట్ :

నాడు నేడు కార్యక్రమం అమలులో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ ఈ సందర్భంగా సంతృప్తి వ్యక్తం చేస్తూ, జిల్లాలోని 1006 పాఠశాలల్లో 'నాడు-నేడు' పనులను జరుగుతున్నాయని, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్కూళ్ళ స్థాయిలో అభివృద్ధి చెందడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నాడు.

# బాలూ కోలుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కోట్లాది మంది బాలు అభిమానులు భగవంతుడిని ప్రార్థిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా వున్న ఆయన ఆరాధకులు నిత్యం ఏదో ఒక గుడిలో పూజలు చేస్తూనే ఉన్నారు. యంజియం ఆసుపత్రి వైద్యులు బాలు ఆరోగ్యాన్ని ప్రతీ క్షణం పర్యవేక్షిస్తూ మెరుగైన వైద్యాన్ని ప్రత్యేకంగా అందిస్తున్నారు. ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఆయన కుమార్తె దీపమ్మ ఎప్పటికప్పుడు బాలు ఆరోగ్య విషయం తెలుసుకుంటూ అవసరమైతే ఢిల్లీ నుండి వైద్య నిపుణులని పిలిపించవలసిందిగా సూచించారు. అందరి ప్రార్థనలు, పూజలు ఫలించి బాలు కోలుకుని ఆరోగ్యవంతంగా తిరిగి వచ్చి భారతీయ సినిమా సంగీత సామ్రాజ్ఞుడిగా తన ప్రస్థానాన్ని కొనసాగించాలని ఆకాక్షిస్తున్నాం.




నెల్లూరు, ఆంధ్రాబ్యాంకు అన్నమయ్య సర్కిల్ బ్రాంచ్ మేనేజర్‌గా పనిచేసి, ప్రస్తుతం కాకినాడలో విధులు నిర్వహిస్తున్న **రాఘువరెడ్డి** (నెల్లూరు వాస్తవ్యులు కాకాణి వెంకటనారాయణరెడ్డి - శ్రీమతి జ్యోతిల కుమారుడు) - **విరజాక్షి** (నెల్లూరుజిల్లా కలువాయి వాస్తవ్యులు చెన్నూరు విజయభాస్కర్‌రెడ్డి - శ్రీమతి పర్వతవర్ధనిల పెద్దకుమార్తె)ల కల్యాణం ఆగస్టు 9వ తేదీ నెల్లూరులో జరిగింది. **రాఘువరెడ్డి - విరజాక్షి** దంపతులకు 'లాయర్' శుభాకాంక్షలు.

# డమ్మీలయ్యారా?

(మొదటి పేజీ తరువాయి)

జరిగిన, జరుగుతున్న పరిణామాలను క్షుణ్ణంగా గమనిస్తే ఇదంతా నిజమే అనిపిస్తోంది ఎవరికైనా.

యంపీలకు ముఖ్యమంత్రి అపాయింట్మెంట్ దొరకకపోవడం, యంఎల్ఏలు మంత్రులు కూడా తమ అధికార కార్యక్రమాల్లో ఎక్కడ కూడా లోక్‌సభ సభ్యులకు ప్రాధాన్యతని కల్పించకపోవడం, అసలు పార్లమెంటు సభ్యులేవారు ఒకరున్నారా? అనే అనుమానం కలిగే స్థాయిలో యంపీలు నిర్లక్ష్యానికి గురికావడం ఇలాంటి అనుమానాలకు, అపోహలకు బలాన్ని చేకూరుస్తోంది.

### ఇలా ఎందుకు జరుగుతోంది..?

ఉమ్మడి రాష్ట్రంలో 42మంది పార్లమెంటు సభ్యుల పేర్లను అప్పట్లో ఏ రాజకీయ పార్టీ కార్యకర్తని అడిగినా ఠక్కున చెప్పేవారు. నియోజకవర్గం పేరు చెప్తే సభ్యుడి పేరో, లేక పార్లమెంటు సభ్యుడి పేరు చెప్తే నియోజకవర్గం పేరో తడుము కోకుండా చెప్పేవారు. అందుకు కారణం అప్పుడు వాళ్ళు ఎప్పుడూ వార్తల్లో వుండే వాళ్ళు, ప్రజల మధ్య తిరిగేవాళ్ళు, రోజూ ఎక్కడో ఒక చోట సేవా కార్యక్రమాల్లో పాల్గొనేవాళ్ళు, తమ పార్టీ అధినాయకుడి పైన ఎవరైనా విమర్శ చేస్తే వీళ్ళు గట్టిగా తిప్పికొట్టే వాళ్ళు. ఢిల్లీ వీధుల్లో సైతం తమ వాణిని వినిపించి తమ ఉనికిని ప్రదర్శించుకునేవాళ్ళు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు.

ఇందుకు కారణం ఏమిటి..? కారకులు ఎవరు..?? అని విశ్లేషించుకోవలసిన అవసరం చాలా వుంది. ఇలా జరగడానికి వైసిపి నుండి గెలిచిన పార్లమెంటు సభ్యుల నిర్లక్ష్యం కూడా కొంత కారణమనే చర్చ కూడా జరుగుతోంది. తమ ఉనికిని కాపాడుకోవడంలో వాళ్ళు విఫలమయ్యారన్నది కొందరి అభిప్రాయం అయితే, ఇది వాళ్ళ తప్పు కానే కాదని, సీనియర్లు యంపీలుగా గెలిచిన చోట జూనియర్‌లు యంఎల్ఏలు కావడం, సీనియర్‌లు శాసనసభ్యులుగా గెలిచిన ప్రాంతంలో జూనియర్లు యంపీలు కావడం ఒక కారణమైతే, ఇద్దరూ సీనియర్లుగా వున్నచోట ఇద్దరిలో ఎవరో ఒకరు చివరినిముషంలో పార్టీ మారి వచ్చిన వారు అయ్యుండడం కూడా మరో కారణం కావడంతో వీరి మధ్య సమన్వయ లోపం బాగా ఏర్పడిందన్నది కూడా బలంగా వినపడుతోంది.

ఉదాహరణకు తిరుపతి, నెల్లూరు, ఒంగోలు పార్లమెంటు స్థానాలను తీసుకుంటే, ఇక్కడ గెలిచిన బల్లిదుర్గాప్రసాద్, ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలు ముగ్గురూ చివరి నిముషంలో తెలుగుదేశంపార్టీ నుండి వచ్చిన వాళ్ళే. రాజకీయాలలో సీనియర్లే, మరి వీరి మాట వారి వారి నియోజకవర్గాలలో చెల్లుబాటు అవుతుందా అంటే... లేదనే చెప్పాలి. చిన్నస్థాయి ఉద్యోగ నియామకాలు, బదిలీలు, ప్రమోషన్ల విషయంలో కూడా శాసన సభ్యులదే శాసనం, అధికారులు లోక్‌సభ సభ్యులను అసలు ప్రజా ప్రతినిధులుగా కూడా గుర్తించడం లేదు. కనీసం కానిస్టేబుల్ కూడా వీరి మాట వినడంలేదు. యంఎల్ఏ ఆదేశమే పరమావధిగా మాకు పైనుండి వత్తిడి ఉందని, ఏదో ముఖ్యమంత్రి కార్యాలయంనుండే నేరుగా ఆదేశాలున్నంత స్థాయిలో యంపి లకు సమాధానం చెప్తున్నారట. ఇటీవల నెల్లూరు నగరంలో జరిగిన ఒక సంఘటనలో ఓ ఎస్పై యంపి ఫోను మాట్లాడుతుండగానే కట్ చెయ్యడమే కాకుండా, ఆయనను అసలు ఖాతరు చేయలేదట. అధికార పార్టీ యంపీలమైయుండి కూడా తమపరిస్థితి ఇలా తయారయ్యిందేమిటబ్బా అని వారు వాపోతున్న విషయం బహిరంగ రహస్యమే. ఎన్నికలప్పుడు పైసలివ్వడానికీ, గెలిచిన తరువాత తమకు కేంద్రం కేటాయించిన నిధులు తేవడానికీ తప్ప తామెందుకూ పనికిరామా ...? అన్న ప్రశ్న వీరిని అంతర్మథనంలో పట్టి పీడిస్తోందని వారి అనుయాయులే గుసగుసలాడుకుంటున్నారు. పవర్ లేని పదవి వున్నా ఒకటే, వూడినా ఒక్కటే అన్నది కూడా వీరి ఆలోచనగా వినపడుతోంది.

వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీకి లోక్‌సభలో 22మంది యంపిలు వున్నప్పటికి రాష్ట్రంలో తరచూ వినపడేది 4 లేదా 5 పేర్లే. వీరిలో ప్రధానంగా వినపడే పేరు పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి, మిథున్ ముఖ్యమంత్రికి అంతరంగికుడు, అత్యంత సన్నిహితుడు, అపాయింట్మెంట్ లేకుండా జగన్‌ని నేరుగా కలువగలిగిన లోక్‌సభ సభ్యుడు మిథున్ ఒక్కడే. జగన్మోహన్‌రెడ్డికి దగ్గర బంధువైన వైఎస్ అవినాష్‌రెడ్డికి కూడా ఇప్పుడు ఆ పరిస్థితి లేదట. ఇక హిందూపూర్ యంపి గోరంట్ల మాధవ్, బాపట్ల యంపి నందిగం సురేష్ లాంటివాళ్లు సంచలనాత్మక విజయాలు సాధించారు కాబట్టి ప్రజలలో కొంత గుర్తింపు పొందారు. గెలిచిన తరవాత వీళ్ళకీ పెద్ద ప్రాధాన్యత లేదు. మరో లోక్‌సభ సభ్యుడు రఘురామకృష్ణంరాజుని ఇప్పుడు ఇటు రాష్ట్రంలోనూ అటు కేంద్రంలోనూ తెలియని వారే లేరు, తనను అందరూ గుర్తుపెట్టుకునే స్థాయిలో వివాదాలు సృష్టించి, పార్టీతో విరోధం పెట్టుకుని వార్తల్లోకెక్కాడు ఆయన. రఘురామ కృష్ణంరాజు అంతటి తీవ్ర స్థాయిలో జగన్ పైనా, విజయసాయిరెడ్డిపైనా, ధ్వజమెత్తుతుంటే ఒక్క యంపి కూడా నోరెత్తకపోవడం చూస్తే లోలోపల చాలామందికి ఇదే అభిప్రాయం ఉందేమో అన్న అనుమానం కలుగుతోంది.

తడనుండి ఇచ్చాపురం వరకు ఇదే పరిస్థితి. ఆంధ్రా యంపిల మద్దతుతో కేంద్ర ప్రభుత్వం ఏర్పడే పరిస్థితే వచ్చి ఉంటే, ఈరోజు సీన్ ఇంకోలా ఉండేదని మనం ఈ సరికే ప్రత్యేకహోదా సాధించుకునేవాళ్ళం అని జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పినప్పుడల్లా మన లోక్‌సభ సభ్యులు కూడా అదే తల్చుకుంటున్నారట, నిజంగా అలా జరిగి వుంటే ప్రత్యేకహోదా సంగతి అటుంచి జగన్మోహన్‌రెడ్డి దగ్గర తమ పలుకుబడి బాగుండేదని వాళ్ళు అంతరంగికులతో తమ బాధ వెళ్లబోసుకుంటున్నారట.

మొత్తానికి ఏ విధంగా చూసినా ఆంధ్రాలో యంపీలు డమ్మీలయ్యారని మాత్రం సర్వత్రా వినిపిస్తుంది. చేతిలో పదవున్నా పవర్ మాత్రం సున్నా అన్న ప్రచారం జోరుగా సాగుతోంది. పేరుకి యంపీలమైనా తాము షోకేసులో బొమ్మలమే అనే బాధ వీరిలో పేరుకు పోయిందన్న మాట ఇప్పుడు టాక్ ఆఫ్ ది స్టేట్.

# సరిహద్దులు మూత..?

(మొదటి పేజీ తరువాయి)

తొలగించారు. ఇప్పుడు ఒక్కసారిగా ఇతర రాష్ట్రాల కేసులు తెలంగాణలో ప్రవేశిస్తుండడంతో కేసిఆర్ ఈ ఆలోచన చేశాడని వినికిడి. సాధ్యాసాధ్యాలను పరిశీలించమని అధికారులను ఆదేశించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయ భోగట్టా. అదే జరిగితే మొన్నటివరకు ఆంధ్రా బోర్డర్‌లో ఉన్న పరిస్థితి ఇప్పుడు తెలంగాణ సరిహద్దుకు మారి సీన్ రివర్స్ కానుంది.

# శ్రద్ధాంజలి



మా ఇంటి జ్యోతి, నిరంతరం మా హృదయాలలో వెలిగే ధృవతార, మాకు మార్గదర్శకులు, అనురాగమూర్తి

## కీ॥ శే॥ శ్రీ గునుపాటి సుబ్బరామిరెడ్డి గారు

(కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం)

పరమపదించి ఆగస్టు 27, 2020 నాటికి 30 సంవత్సరాలు నిండుతాయి
ఆ మహనీయమూర్తిని సంస్మరించుకుంటూ... వారి ఆత్మకు శాంతి చేకూరుటకై ప్రార్థిస్తున్నాము.

అర్ధాంగి: **కీ॥శే॥ గునుపాటి రుక్మిణమ్మ**

కుమారులు – కోడళ్ళు

**గునుపాటి వెంకటకృష్టారెడ్డి – ఇందిరమ్మ**
**గునుపాటి జనార్ధన్‌రెడ్డి – సునీతమ్మ**
**గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి – శుభప్రదమ్మ**

కుమార్తెలు – అల్లుళ్ళు

**కోటిరెడ్డి నిర్మలమ్మ – కీ॥ శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి**
**అత్తివరపు విమలమ్మ – అత్తివరపు రామచంద్రారెడ్డి**
**కీ॥శే॥ దొడ్ల లలితమ్మ – దొడ్ల పద్మనాభరెడ్డి**

మరియు **మనుమలు, మనుమరాళ్ళు, మునిమనుమలు, మునిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** e-mail: roopagroup@yahoo.com